www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు


జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -214 శనివారం 21 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



బైక్ ట్యాక్సీల నిషేధానికి సుప్రీం నో..

నిషేధం కన్నా నియంత్రణే మేలని వ్యాఖ్య

కర్ణాటకలో బైక్ ట్యాక్సీల రద్దు పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఆటోలతో పోల్చితే బైక్ ట్యాక్సీలు ఐదు రెట్లు చవకని ప్రస్తావన

2లో.

21వ శతాబ్దపు సాంకేతికతతో కొత్త అవకాశాలు!

సాంస్కృతిక అనుసంధానానికి డిజిటల్ వేదికలు దోహదం : ప్రధాని మోడీ



కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రత్యర్థి

కేసీఆర్ నా కథలో రావణాసురుడు..

మోడీ విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్ : సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

మాజీ సీఎం కేసీఆర్‌ను రావణాసురుడితో పోల్చిన సీఎం రేవంత్

కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని ఘాటు విమర్శ

తెలంగాణలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ

బీజేపీకి పాత్ర లేదు, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షమన్న సీఎం

తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి



హైదరాబాద్ , నవంబర్ 20,(ప్రజావినికిడి):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. "కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను" అని అన్నారు. మిగతాది 2లో...



పసిడి ధరలకు భారీ బ్రేక్..

ఒక్కరోజే రూ.5,638 తగ్గి రూ.1,23,893 వద్ద

ముగిసిన 24 క్యారెట్ల పసిడి రేటు

కిలో వెండి ధర ఏకంగా రూ.1.52 లక్షలకు తగ్గుముఖం

అంతర్జాతీయ మార్కెట్లో ఎనిమిది నెలల కనిష్టానికి జారిన స్పాట్ గోల్డ్

రూపాయి విలువ బలపడితే పసిడి రేటు రూ.1 లక్షకు చేరే అవకాశం ఉందంటున్న విశ్లేషకులు



2లో.

కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం అసత్యాలు

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?.. సీఎం రేవంత్ ప్రసంగంపై భగ్గుమన్న హరీశ్

సిద్దిపేట సభలో సీఎం రేవంత్ వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిచ్చారన్న హరీశ్

దేవాదుల వద్ద మోటార్లు పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని ప్రశ్న

సిద్దిపేట , నవంబర్ 20 ,(ప్రజావినికిడి):

సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా సభ అట్టర్ ప్లాప్ కావడంతో సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డం వంటి వ్యక్తిగత విషయాలపై మిగతాది 2లో...



ఘనంగా చుక్కా రామయ్య శత వసంతాల వేడుకలు

మాస్టారి ఇంటికెళ్లి ఆశీస్సులు తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

రెండు సార్లు రామయ్య పాదాలకు నమస్కరించిన ముఖ్యమంత్రి

బాగున్నావా అని రేవంత్‌ను పలకరించిన మాస్టారు

ఎమ్మెల్సీగా ఆయన సహచర్యాన్ని గుర్తు చేసుకున్న సీఎం

హైదరాబాద్ , నవంబర్ 20,(ప్రజావినికిడి):

: చదువుల చుక్కాని, ప్రజా ఉద్యమాలకు పెద్దదిక్కు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు చుక్కా రామయ్య శత వసంతాల వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రామయ్య మాస్టారి వందో పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెప్పి, మిగతాది 2లో...



మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు..



ఖానాపూర్, హైదరాబాద్‌లలో ఉదయం నుంచే ముమ్మరంగా సాగుతున్న తనిఖీలు

రూ.40.96 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు

ఖానాపూర్ నివాసం వద్ద రేఖను అరెస్ట్ చేసే అవకాశం

హైదరాబాద్ , నవంబర్ 20 ,(ప్రజావినికిడి):

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ ఉదయం ఖానాపూర్‌తో పాటు హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో ఈడీ అధికారులుమిగతాది 2లో...



'ఎంపవర్‌స్టార్'

2లో.

డిప్యూటీ సీఎం విజన్‌పై ఉపాసన కొణిదెల ప్రశంసలు

పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఉపాసన కొణిదెల, స్మృతి ఇరానీ

మహిళలు, విద్యార్థినుల సాధికారతకు పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్న ఉపాసన

అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందని వెల్లడి



2లో.

తీరం దాటిన అక్వాన్

ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ వర్షపాతం నమోదు

పంట నష్టంపై సాయం అందించండి..

అర్నబ్, మురసు తుపానుల విధ్వంసం..

ఉద్యాన పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల సాయం కోరిన సీఎం చంద్రబాబు

అర్నబ్ మురసు తుఫాన్ల ప్రభావంతో ఉద్యాన పంటలకు రూ.1,092 కోట్ల నష్టం

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

దెబ్బతిన్న తోటల పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల అదనపు సాయం కోరిన ఏపీ సర్కార్

రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో నష్టపోయిన 71,576 మంది రైతులు



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రత్యర్థి

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు.ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

మోడీ విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్

సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ దేశానికి విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆయన అన్ని రాష్ట్రాలకు వెళ్లేలా కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి తగిన సహకారం అందడం లేదని పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధే లక్ష్యం

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని సీఎం తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

నెహ్రూ నుంచి మన్మోహన్ వరకు

దేశాభివృద్ధిలో కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషించిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, మన్మోహన్‌సింగ్ వంటి నాయకుల పాలనలో దేశానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అందాయని వివరించారు. విద్య, సాగునీరు, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తుచేశారు.దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ముందుకు సాగుతోందని అన్నారు.

వచ్చే రెండేళ్లలో తెలంగాణకు కొత్త దిశ

తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

మరోవైపు క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, 8 వేల మంది క్రీడాకారులతో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని, త్వరలోనే పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

తీరం దాటిన అక్వాన్

నవంబర్ 20,(ప్రజావినికిడి):

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు.

తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది.

తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

పంట నష్టంపై సాయం అందించండి..

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

నవంబర్ 20,(ప్రజావినికిడి):

అరటి మిర్చి కొబ్బరి పంటల పునరుద్ధరణకు కేంద్ర పథకాల నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి

ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలకు ఏకంగా రూ.1,092 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు.ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా విరుచుకుపడిన రెండు తుఫాన్ల వల్ల రాష్ట్రంలోని 18 జిల్లాల్లో తీవ్ర విధ్వంసం జరిగిందని చంద్రబాబు వివరించారు. మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ముఖ్యంగా అర్నబ్ తుఫాను ప్రభావంతో 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో తోటలు నాశనమయ్యాయని, ఇందులో ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో నేలమట్టమైందని తెలిపారు. అలాగే మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు.

రైతులను ఆదుకునేందుకు కేంద్ర పథకాల ద్వారా తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. తీవ్రంగా నష్టపోయిన అరటి తోటల పునరుద్ధరణ కోసం 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్' స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' కింద ఎండుమిర్చి, కూరగాయల పంటల రైతులకు అండగా నిలవాలని కోరారు.కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు 'కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు' ద్వారా ఆర్థిక సహకారం అందించాలని లేఖలో విన్నవించారు. రైతులకు దీర్ఘకాలిక నష్టాలను తగ్గించేందుకు ఈ సాయాన్ని త్వరితగతిన విడుదల చేయాలని చంద్రబాబు కోరారు.

21వ శతాబ్దపు సాంకేతికతతో కొత్త అవకాశాలు!

సాంస్కృతిక అనుసంధానానికి డిజిటల్ వేదికలు దోహదం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: నవంబర్ 20,(ప్రజావినికిడి):

21వ శతాబ్దపు ఆధునిక సాంకేతికత ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక అనుసంధానానికి, పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను సృష్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. సాంస్కృతిక, నాగరికతా సంబంధాలు దేశాల మధ్య స్నేహపూర్వక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్-సీఓ) సివిలైజేషనల్ డైలాగ్ ఫోరమ్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశంలోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, పురావస్తు కేంద్రాల్లో వేలాది సంవత్సరాల చరిత్రకు సంబంధించిన విలువైన వారసత్వ సంపద భద్రంగా ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఈ అమూల్యమైన సంపదను భవిష్యత్ తరాలకు అందించవచ్చని పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో భద్రత, ఆర్థిక వ్యవస్థ, అనుసంధానత వంటి రంగాల్లో ఎస్సీఓ దేశాల మధ్య సహకారం గణనీయంగా పెరిగిందని మోడీ తెలిపారు. ఈ నేపథ్యంలో సాంస్కృతిక, నాగరికతా సహకారం దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వేదిక ద్వారా కొత్త ఆలోచనలు, సాంస్కృతిక సహకారానికి సంబంధించిన అవకాశాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

సామ్రాజ్యాలు ప్రపంచ పటాలను మార్చినప్పటికీ, నాగరికతల మధ్య చర్చలు, సంభాషణలు ప్రపంచ ఆలోచనా విధానాలను ప్రభావితం చేసి మరింత సమృద్ధి చేశాయని వివరించారు. ఎస్సీఓ నాగరికతా వేదిక కేవలం సాంస్కృతిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు.డిజిటల్ వేదికలు సాంస్కృతిక మార్పిడులు, అంతర్జాతీయ సహకారాన్ని మరింత సులభతరం చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను ఎస్సీఓ సభ్య దేశాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భారత్ ఆతిథ్యమిస్తుండగా, న్యూఢిల్లీలోని చారిత్రక పురానా ఖిల్లాలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాకిస్థాన్‌తో సహా పలు ఎస్సీఓ సభ్య దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా చుక్కా రామయ్య శత వసంతాల వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

ఆశీస్సులు తీసుకునేందుకు రాజకీయ, సామాజిక ప్రముఖులు విద్యానగర్‌లోని ఆయన ఇంటికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా విద్యానగర్‌కు వెళ్లి రామయ్యను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఇంట్లోకి అడుగు పెట్టగానే ఒకసారి, తిరిగి వెళ్లేటప్పుడు మరోసారి రామయ్య మాస్టారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.కొద్దిరోజులుగా మంచానికే పరిమితమైన రామయ్య ముఖ్యమంత్రిని 'బాగున్నావా' అంటూ పలకరించారు. రామయ్య కుమారులు శ్రీనివాస్, అచ్యుత్, కుమార్తెలు ఉమ, రాజేశ్వరిలను రేవంత్ పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఆచార్య హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, కె.రామచంద్రమూర్తిలతో లెక్కల మాస్టారి జీవిత విశేషాల గురించి ముచ్చటిస్తూ ముఖ్యమంత్రి దాదాపు 40 నిమిషాలకు పైగా అక్కడే గడిపారు. రేవంత్ చొరవను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హరగోపాల్ ప్రశంసించారు. చుక్కా రామయ్య జన్మదినం తెలంగాణ రాష్ట్రానికి, విద్యారంగానికి పర్వదినమని సీఎం రేవంత్ మీడియాతో అన్నారు. సాయుధ రైతాంగ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ప్రతి ప్రజా పోరాటంతో కలిసి నడిచిన రామయ్య మాస్టారు మనకు నిలువెత్తు ఆదర్శమని చెప్పారు.

ఐఐటీ అనే పదాన్ని తెలుగువారికి పరిచయం చేసిన ఘనత కూడా ఆయనదేనని కొనియాడారు. సామాజిక పరివర్తన కోసం నిరంతరం తపించిన గొప్ప విద్యావేత్త వందో పుట్టినరోజును తెలంగాణ ప్రజలంతా గర్వంగా భావించాలన్నారు. మండలి సభ్యుడిగా రామయ్య నిర్మాణాత్మక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో చుక్కా రామయ్య, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ వంటి విద్యావేత్తలతో కలిసి పనిచేశానని తాను గొప్పగా చెప్పుకుంటానని రేవంత్ అన్నారు. చట్టసభల్లో ప్రజా సమస్యలను లేవనెత్తడమే కాకుండా వాటి పరిష్కార మార్గాలు కూడా సూచించే అతికొద్ది మంది ప్రజాప్రతినిధుల్లో రామయ్య ఒకరని అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేదన్న విషయాన్ని ఆనాడు రామయ్య మండలిలో చెప్పేవరకు ఎవరికీ తెలియదని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి, పీవీ నరసింహారావు, జైపాల్‌రెడ్డి, చుక్కా రామయ్య వీరంతా కాలానికి, రాజకీయాలకు అతీతమైన వ్యక్తులని రేవంత్ అన్నారు. చుక్కా రామయ్య ఆలోచనల స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా చుక్కా రామయ్యను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, పట్టు వస్త్రాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామయ్య జీవితం భావితరాలకు స్ఫూర్తి పాఠమని కొనియాడారు. 1964లో చాదర్‌ఘాట్ ధర్మవంత్ పాఠశాలలో తన గురువు రామయ్యతో ఉన్న అనుబంధాన్ని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గుర్తుచేసుకున్నారు. తరగతి గదిలో రామయ్య మాస్టారు చెప్పే పాఠం ఒక్కసారి వింటే చాలు, అలాగే మనసులో నాటుకుపోయేదని అన్నారు.

కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం అసత్యాలు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లాలో జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన విషయాన్ని అక్కడి పోలీస్ కమిషనరే స్వయంగా చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సభలో బూతులు, అబద్ధాలు వల్లెవేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవంటూ సీఎం చెప్పడం పచ్చి మోసమని హరీశ్ ఆరోపించారు. అలాంటప్పుడు దేవాదుల దగ్గర మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి కేటాయించిన నీటిని ఎందుకు తోడలేకపోతున్నారని నిలదీశారు. కృష్ణా నదిలో రాష్ట్రానికి రావాల్సిన 299 టీఎంసీలను సైతం ఉపయోగించుకోలేని అసమర్థ స్థితిలో ఈ పాలన ఉందని విమర్శించారు. ట్రిబ్యునల్ ముందు సమర్థంగా వాదనలు వినిపించడంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, సభలో మాట్లాడిన పచ్చి అబద్ధాలకు గానూ సీఎం ముక్కు నేలకు రాయాలని హరీశ్ డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో పడి తెలంగాణ సాగునీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీకి కాంగ్రెస్ సర్కారే ప్రత్యక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు.

బైక్ ట్యాక్సీల నిషేధానికి సుప్రీం నో..

నిషేధం కన్నా నియంత్రణే మేలని వ్యాఖ్య

న్యూఢిల్లీ: నవంబర్ 20,(ప్రజావినికిడి):

కర్ణాటకలో బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని సమర్థిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నిషేధించడం కంటే నియంత్రించడమే సరైన మార్గమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని రద్దు చేస్తూ గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.పిటిషన్‌ను తోసిపుచ్చిన అనంతరం జస్టిస్ సతీష్ చంద్ర శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. "జీపీఎస్ సౌకర్యం ఉండటం వల్ల యువతులకు బైక్ ట్యాక్సీలు మరింత సురక్షితం. వీటిని పూర్తిగా నిషేధించే బదులు నిబంధనలతో నియంత్రించడం మేలు. ఇప్పటికే దేశంలోని 25 రాష్ట్రాల్లో ఇవి నడుస్తున్నాయి. మా ఆఫీసులోని యువతులను ఎలా ప్రయాణిస్తున్నారని అడిగితే బైక్ ట్యాక్సీల్లోనే వస్తున్నామని చెప్పారు. ఆటోలతో పోలిస్తే ఇది ఐదు రెట్లు చవక అని వారు తెలిపారు" అని జస్టిస్ శర్మ వ్యాఖ్యానించారు.

గతంలో ఓలా, ఉబెర్, రాపిడో వంటి అగ్రిగేటర్లు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన కర్ణాటక హైకోర్టు డివిజన్ బెంచ్, వాహనాలను ట్రాన్స్‌పోర్ట్ కేటగిరీ కింద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ క్యారేజీలుగా అనుమతులు పరిశీలించాలని స్పష్టం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా చుక్కెదురైంది.

'ఎంపవర్‌స్టార్'

డిప్యూటీ సీఎం విజన్‌పై ఉపాసన కొణిదెల ప్రశంసలు

పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఉపాసన కొణిదెల, స్మృతి ఇరానీ

పిఠాపురం నవంబర్ 20,(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రముఖ వ్యాపారవేత్త, అపోలో హాస్పిటల్స్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల పర్యటించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీతో కలిసి ఆమె పిఠాపురం పరిధిలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అపోలో ఫౌండేషన్ చేపట్టిన 'అపోలో ఆరంభ్' ప్రాజెక్టులో భాగంగా కొణిదెల కుటుంబ సహకారంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజన్‌ను ఉపాసన కొణిదెల ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల్లో పవన్ కల్యాణ్ 'పవర్ స్టార్'గా సుపరిచితులైనప్పటికీ, పిఠాపురంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, సాధికారత కార్యక్రమాలను చూసిన తర్వాత తనకు ఆయన 'ఎంపవర్ స్టార్'గా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, రుణాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఏర్పాటుతో విద్యార్థుల సాధికారతకు కృషి చేస్తున్నారని కొనియాడారు.రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి కేంద్రాన్ని పిఠాపురంలో ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ కేంద్రం స్థానిక తల్లులు, చిన్నారులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుందని నిర్వాహకులు వెల్లడించారు.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు..

(మొదటి పేజీ తరువాయి)

ఏకకాలంలో ముమ్మర సోదాలు చేపట్టారు.

ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022-23, 2023-24, 2024-25 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది.

గత ఆగస్టు నెలలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఫిర్యాదు చేయడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా రంగంలోకి దిగి సోదాలు చేస్తున్నారు.ప్రస్తుతం ఖానాపూర్‌లోని రేఖానాయక్ నివాసం వద్ద విజిలెన్స్, స్థానిక పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. నివాసాల్లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు, విచారణ అనంతరం ఆమెను అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పసిడి ధరలకు భారీ బ్రేక్..

ఒక్కరోజే రూ.5,638 తగ్గి రూ.1,23,893 వద్ద ముగిసిన 24 క్యారెట్ల పసిడి రేటు

న్యూఢిల్లీ: నవంబర్ 20,(ప్రజావినికిడి):

దేశీయ మార్కెట్లో బంగారం ధరలు శుక్రవారం ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. 10 గ్రాముల పసిడి ధర రూ.1.25 లక్షల దిగువకు పడిపోవడంతో, రానున్న రోజుల్లో ఇది రూ.1 లక్ష వరకు తగ్గుతుందా అనే ఆసక్తికర చర్చ మొదలైంది. అయితే, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, రూపాయి మారకం విలువపైనే ఇది ఆధారపడి ఉంటుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వివరాల ప్రకారం.. 24 క్యారెట్ల (999 ప్యూరిటీ) 10 గ్రాముల బంగారం ధర శుక్రవారం సాయంత్రానికి ₹5,638 (సుమారు 4.35%) తగ్గి ₹1,23,893 వద్ద ముగిసింది. అటు కిలో వెండి ధర కూడా రూ.1,60,439 నుంచి రూ.1,52,528కి పడిపోయింది. ఈ ధరల్లో జీఎస్టీ, తయారీ ఛార్జీలు ఉండవు.ఎంసీఎక్స్ (వీజశ) మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు ₹1,21,424కి జారింది. ఈ ఏడాది నమోదైన గరిష్ఠ స్థాయి రూ.1.80 లక్షలతో పోలిస్తే ఇది భారీ తగ్గుదల. మరోవైపు, రాయిటర్స్ నివేదిక ప్రకారం అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 3,571 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ బలపడటం, ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత పెంచే సంకేతాలు ఇవ్వడం బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చాయి.రూపాయి మారకం విలువ మరింత బలపడి, అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ 3,000 డాలర్లకు పడిపోతే దేశీయంగా పసిడి రూ.1 లక్షకు చేరే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు స్థిరంగా ఉండటం ధరకు కొంత మద్దతునిచ్చే అంశం. ప్రస్తుతానికైతే రూ.1 లక్ష స్థాయి అనేది కొన్ని పరిస్థితులపై ఆధారపడి ఉన్న అవకాశమే తప్ప, కచ్చితమైన ముగింపు కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

సైబర్ నేరాలు,డ్రగ్స్,గంజాయిపై విద్యార్థులకు అవగాహన సదస్సు

షాద్ నగర్ పట్టణ సీఐ సీతారాం..

తెలియని లింకులు క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ..
విద్యార్థులకు పోలీసుల హెచ్చరిక

షాద్‌నగర్,(ప్రజావినికిడి):
పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్స్,గంజాయి మహమ్మారిని తరిమికొడదాంఅనే నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ సీతారాంతో పాటు సైబర్ క్రైమ్,షీ టీం అధికారులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పట్టణ సీఐ సీతారాం మాట్లాడుతూ, విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.చెడు వ్యసనాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారని,అలాంటిది కొందరు విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దని అన్నారు.ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరిగి,ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పలు నేరాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.అమ్మాయిలపై వేధింపులు,అసభ్యకర ప్రవర్తనకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలియని ఫైల్స్,లింకులు క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే





లింకులు,ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని తెలిపారు. సైబర్ నేరాలకు గురవుతున్న వారిలో చదువుకున్న వారు కూడా అధికంగానే ఉంటున్నారని, అత్యాశకు పోయి సులభంగా మోసపోతున్నారని వివరించారు.ఒక ఉపాధ్యాయురాలికి ఐసీఐసీఐ బ్యాంకు పేరుతో డెబిట్ కార్డు సేవలు నిలిచిపోతున్నాయని,రోజుకు రూ.4,000 చెల్లించాలని మెసేజ్ వచ్చిందని తెలిపారు. అందులోని లింక్ క్లిక్ చేయడంతో ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అయి,ఆమె బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.2.90 లక్షలు మాయమైనట్లు ఉదాహరణగా వివరించారు.
సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందించి 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.అలాగే పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో రోజుకు రూ.10 వేల వరకు సంపాదించవచ్చంటూ లింకులు పంపి,మొదట కొంత డబ్బు చెల్లించి నమ్మకం కలిగించి, ఆ తర్వాత పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు.ఇలాంటి మోసాల బారినపడి ఓ మహిళ సుమారు రూ.4 లక్షలు కోల్పోయిన ఘటనను వివరించారు.తెలియని లింకులు,ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయకుండా వెంటనే తొలగించాలని సూచించారు.

మైనర్ లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదు.

విద్యార్థులు 18 సంవత్సరాలు నిండకుండా వాహనాలు నడపకూడదని,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైకులు నడపడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం కూడా నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.అనంతరం సైబర్ క్రైమ్,షీ టీం అధికారులు మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,వాటికి బానిసలై జీవితాలను అంధకారం చేసుకోవద్దని కోరారు.మహిళలు,బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం,ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ,సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకుని,ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగల పౌరులుగా ఎదగాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలోఎస్ఐ,శ్రీకాంత్ షీటీం సభ్యులు,సురేష్ గౌడ్, జ్యోతి,శ్రీకాంత్,శేఖర్,సైబర్ క్రైమ్,శ్రీనివాస్,ఏఎస్ఐ మురళీకృష్ణ,కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి,ఉపాధ్యాయులు,ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ బృందం తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్, ఫరూక్ నగర్ మండల కార్యదర్శి అనిల్ నాయక్,ఉపాధ్యక్షులు,శ్రీహరి,నరేష్,పవన్ విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో సత్య ఏజెన్సీస్ రెండో షోరూమ్ ప్రారంభం

ఎల్బీనగర్, (ప్రజావినికిడి): నవంబర్ 20,
వనస్థలిపురం వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో సత్య ఏజెన్సీస్ తన రెండో షోరూమ్‌ను వనస్థలిపురంలో ఘనంగా ప్రారంభించింది. ప్రారంభోత్సవం సందర్భంగా టీవీలు,ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు,మొబైల్స్ తదితర గృహోపకరణాలపై ప్రత్యేక రాయితీలు ప్రకటించారు. సులభమైన ఈఎంఐ,జీరో డౌన్‌పేమెంట్, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంతేకాకుండా ప్రతి మూడు గంటలకు ఒక అదృష్ట విజేతకు సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్‌ను బహుమతిగా అందించనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు ఈ ప్రారంభోత్సవ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.



ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి : డా.ప్రియాంక..

పోలియో చుక్కల నుంచి పిల్లలకు రక్షణ. -సీహెచ్ఓ వెంకట్ రెడ్డి..





హయత్ నగర్,(ప్రజావినికిడి):
అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సమన్వయ సమావేశం శుక్రవారం రోజు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు హయత్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.అబ్దుల్లాపూర్‌మెట్ వైద్యాధికారి డాక్టర్ టి. ప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన వైద్యులు, సీహెచ్ఓ వెంకట్ రెడ్డి,ఎంపీహెచ్ఓ లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ జానకమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు మొత్తం 39,905 మంది ఉన్నారని తెలిపారు.పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణకు సంబంధించి వివరాలు: రూట్లు: 10మొబైల్ టీమ్స్: 02పోలియో బూత్‌లు:114వ్యాక్సినేటర్లు: 468ఈ నెల 22 నవంబర్ 2026, ఆదివారం నాడు పోలియో బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. అనంతరం నవంబర్ 23,24 తేదీల్లో రెండు రోజుల పాటు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు.కావున తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ టి. ప్రియాంక కోరారు.

స్లేట్ ది స్కూల్ 9వ వార్షికోత్సవంలో ప్రతిభను చాటిన విద్యార్థినులు

ఆబిడ్స్,(ప్రజావినికిడి):
హిమాయత్ నగర్ లోని స్లేట్ ది స్కూల్ 9వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు కార్యక్రమానికి11 వందల మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. నేటి సాంకేతిక యుగంలో పిల్లల పెరుగుదల, విద్య, తల్లిదండ్రుల బాధ్యతలు, మానవీయ విలువల ప్రాధాన్యత వంటి అంశాలను విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలతో ఆవిష్కరించారు. సాఫ్ట్‌వేర్ విప్లవం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)యుగం వరకు చోటుచేసుకున్న మార్పులు, డిజిటల్ పరికరాలపై ఆధారపడటం, కుటుంబ సంబంధాలు, వినియోగ సంస్కృతి,ఆర్థిక క్రమశిక్షణ వంటి సమకాలీన అంశాలను ప్రదర్శనల రూపంలో కళ్లకు కట్టారు. సమకాలీన సమాజంలోని సమస్యలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, కుటుంబ సంబంధాలు, సామాజిక బాధ్యతలపై ఆలోచింపజేసింది.పరీక్షలు,





ర్యాంకుల విషయంలో పిల్లలపై తల్లిదండ్రుల ఒత్తిడి,సంపద, హోదా కోసం జరిగే పోటీ, ఓటీటీ,సోషల్ మీడియా ప్రభావం, మొబైల్ ఫోన్ వ్యసనం,సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లు,లోన్ యాప్‌ల కారణంగా కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక,మానసిక సమస్యలను విద్యార్థులు నాటకీయ ప్రదర్శనల ద్వారా మంత్రముగ్దులను చేశారు. విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానం, పరీక్షల్లో సాధించే మార్కులు మాత్రమే కాదని, జీవితంలోని విభిన్న పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే సంపూర్ణ వ్యక్తులుగా, బాధ్యతాయుత పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దడమే నిజమైన విద్య అనే సందేశాన్ని స్లేట్ పాఠశాల చాటిచెప్పిందని ప్రిన్సిపల్ చెప్పారు.

డిసెంబర్ 12వ, తేదీన జాతీయ లోక్ అదాలత్

సమీక్షా సమావేశం నిర్వహించిన 16వ జిల్లా అదనపు జడ్జి,మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.స్వాతి రెడ్డి
సమీక్ష సమావేశంలో
న్యాయమూర్తులు,పోలీసు అధికారులు

షాద్ నగర్.(ప్రజావినికిడి):
రాజి మార్గమే రాజ మార్గంగా వివిధ కేసుల పరిష్కారం కోసం డిసెంబర్ 12వ,తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసి అత్యధికంగా కేసులు పరిష్కరించబడే విధంగా సహకరించాలని ముఖ్య అతిథి16వ,జిల్లా అదనపు జడ్జి అదేవిదంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.స్వాతి రెడ్డి సమీక్ష



సమావేశం నిర్వహించి షాద్ నగర్ నియోజకవర్గ పోలీసు అధికారులకు మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ మల్యాల సాహితి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా చైర్మన్ ఎస్.స్వాతి రెడ్డి మాట్లాడుతూ కక్షిదారులందరినీ సమన్వయపరిచి,కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోకుండా రాజీ పడదగ్గ కేసులు అన్నింటిని రాజీ చేసుకునే విధంగా ప్రోత్సహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 12వ తేదీన జరగబోవు జాతీయ లోక్ అదాలత్ లో కక్షిదారులు పాల్గొని తమ తమ కేసులను పరిష్కరించుకోవాల్సిందిగా, అందుకు అధికారులు ప్రోత్సహించాల్సిందిగా అధికారులకు మార్గదర్శకాలు ఇస్తూ ఆదేశించారు.
ఈ సమీక్ష సమావేశంలో పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా,ఏసిపి లక్ష్మీనారాయణ,సిఐలు సీతారాం,బి.శ్రీనివాస్,సి.నాగేశ్వర్ రెడ్డి,బి.నాగార్జున రెడ్డి,నందిగామ ఎస్సై జె.సుశీల, కోర్టు పోలీసు సిబ్బంది,కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ మండల కమిటి ఎన్నిక



వాజేడు,నవంబర్ 21,(ప్రజావినికిడి):శుక్రవారం చెరుకూరులో తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది మండల ఆధ్యక్షులుగా చాప.లక్ష్మణరావు ప్రధాన కార్యదర్శిగా వాసం.సంతోష్, ఉపాధ్యక్షులుగా యర్మ.హరినాథ్, అంజనేలు, పరమేశ్, రామకృష్ణ, శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శిగా, వంశీకృష్ణ , రవీందర్, కోశాదికారిగా, మోడెం,సురేశ్ ను ఎన్నుకోవటం జరిగింది.ఈ కార్యక్రమానికి,ముఖ్య అతిదిగా,తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కబ్బాక.శ్రవణ్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షులు యాసం రాజు,జిల్లా కార్యదర్శి పాయం,జానకి రమణ,జిల్లా ఆధ్యక్షులు,సిద్ద బోయిన సర్వేశ్వరావు, చెరుకూరు సర్పంచ్ వాసం రాజబాబు,మడప శ్రీనివాసరావు పాయం అంజిబాబు జిల్లా నాయకులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయాలి

భాష సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు

ముషిరాబాద్, (ప్రజావినికిడి):
ఆధునిక శాస్త్ర సాంకేతిక యుగంలో బాల్యవస్థనుండే విద్యార్థులు అనేక విషయాల్లో ముందుంటున్నారని, అలాంటి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసినప్పుడే పెద్దవారుగా మనం వారికి నిజమైన తోడ్పాటును ఇచ్చిన వాళ్ళం అవుతామని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ బాలో సాల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సుందరయ్య విజ్ఞానం కేంద్రంలో నిర్వహించిన ఆరవ పిల్లల జాతర ప్రారంభోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, అన్ని దానాలలో కన్నా విద్యా దానం,వైద్య దానం ప్రధానమని అన్నారు.నేడు విద్యా వ్యవస్థ అంతా ప్రైవేటీకరించబడి విద్యార్థులు పుస్తకాల్లో ఉన్న సిలబస్ తప్ప బయటి సమాజం గురించి,చరిత్ర గురించి అవగాహన కొరబడుతుందన్నారు.అలాంటి పని తెలంగాణ బాలోత్సవం కమిటీ చేయడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఒకే చోట వేలమంది విద్యార్థులను రప్పించి ఒకేరోజు వివిధ ఈవెంట్లలో పోటీలు నిర్వహించి వారి ప్రతిభను వెలికి తీయడానికి





జరిగే ప్రయత్నం చాలా గొప్పదని అభినందించారు. ఇలాంటి ప్రయత్నానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం అందిస్తే ఇంకా ఎక్కువగా ఉపయోగపడుతుందని అన్నారు.పిల్లల్లో శాస్త్రీయ భావాలు,దేశ సమైక్యత సమగ్రత పై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు
హైస్కూల్ స్థాయి నుంచే కొన్ని అసాంఘిక చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారి మూలంగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దాంతో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాంటి పరిస్థితుల నుంచి పిల్లలను కాపాడాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా జరుగుతుండాలని అప్పుడే వాళ్లకు సరైనటువంటి అవగాహన వస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠశాలలకు, సర్టిఫికెట్లు మెమెంటోస్ అందజేశారు. తెలంగాణ బాలోత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య, కమిటీ సభ్యులు కే.సుజావతి, మోటిపేటర్స్ శైలజ,మమత, రూపా రుక్మిణి, అంకమ్మ,వద్మ, మారయ్య, బ్రాహ్మణి, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

చండ్రుపట్ల ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన పర్యవేక్షణ అధికారి

విద్యార్థుల అభ్యసన ఫలితాలు భేష్
పాఠశాలపై విద్యా పర్యవేక్షణ అధికారి ప్రశంసలు

వాజేడు, (ప్రజావినికిడి):ధర్మవరం కాంప్లెక్స్ విద్యా పర్యవేక్షణ అధికారి వేణుగోపాల్, శుక్రవారం ఎంపియుపిఎస్ చండ్రుపట్ల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఎఫ్ఎల్ఎన్, ఆధారిత విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, తరగతి గది బోధనను పాఠశాల నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు విద్యార్థులతో ముఖాముఖి గా మాట్లాడుతూ వారి అభ్యసన స్థాయిని నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ఎఫ్ఎల్ఎన్, నైపుణ్యాలు, చదవడం, రాయడం,గణిత సామర్థ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, బోధనలో బోధనాభ్యసన సామగ్రిని వినియోగించాలని సూచించారు. అలాగేపాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రికార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పట్ల పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి చెందుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం సిఆర్పి రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు బిక్షపతి,నజీం బాబా, విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక


డీజీపీ సి.వి.ఆనంద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్.(ప్రజావినికిడి):
గతంలో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో పలు ప్రభుత్వ కార్యక్రమంలో జరిగిన పలు పరిణామాల మీద తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సి.వి.ఆనంద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గంలో అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే పాల్గొనకుండా ప్రోటోకాల్ ఉల్లంఘన,
దుష్ప్రవర్తన అడ్డుకుంటున్న పోలీసు అధికారులపై తగిన చర్య తీసుకోవాలని అభ్యర్థన చేశారు. ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్వహించే అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా పోలీసు అధికారులు పదేపదే ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడం అలాగే అనుచితంగా ప్రవర్తించడం వంటి కొన్ని సంఘటనలను వారి దృష్టికి తీసుకొచ్చారు.
గత మూడు సంవత్సరాలుగా ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయి.
దుష్ప్రవర్తన అదేవిదంగా పక్షపాత వైఖరి యొక్క నిరంతర ధోరణిని స్పష్టం చేసే కొన్ని నిర్దిష్ట ఉదాహరణలు క్రింద ఇవ్వబడ్డాయి.
1.సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సంఘటన (19-09-2026):
సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జీ.ఓ.118 కింద ఇంటి స్థలం పట్టాల పంపిణీ జరుగుతున్నప్పుడు,ఎలాంటి అధికారిక హోదా లేని పలువురు వ్యక్తులను వేదికపై ముందు వరుస కుర్చీలలో కూర్చోవడానికి అనుమతించారు.నేను స్థానిక ఎమ్మెల్యేగా అక్కడ ఉన్నప్పటికీ,
పోలీసు సిబ్బంది సరైన నియమావళిని పాటించడంలో విఫలమయ్యారు.నేను సభను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా,ఎలాంటి అధికారిక హోదా లేని ఒక వ్యక్తి నా చేతిలోంచి బలవంతంగా మైక్రోఫోన్‌ను లాక్కున్నాడు.
దిగ్భ్రాంతికరంగా,పోలీసు సిబ్బంది నిశ్శబ్ద ప్రేక్షకులుగా ఉండిపోయారు. తప్ప జోక్యం చేసుకోవడంలో గానీ ఎలాంటి చర్య తీసుకోవడంలో గానీ విఫలమయ్యారు.ఇలాంటి సంఘటనలు లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రజా కార్యక్రమాల సజావుగా నిర్వహణకు ఆటంకం కలిగించారు.
2. చంపాపేట్ మోడల్ మార్కెట్‌లో జరిగిన సంఘటన: 18-11-2026న,చంపాపేట్ మోడల్ మార్కెట్‌లో జరిగిన చేయూత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఇలాంటి ఘటనే జరిగింది.
జీహెచ్ఎంసీ అధికారులు మాకు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటలకు జరగాల్సి ఉంది. ఆ తర్వాత,కార్యక్రమాన్ని సాయంత్రం 4:30 గంటలకు వాయిదా వేసినట్లు మాకు తెలియజేశారు.అందుకని లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆ ప్రాంగణం పూర్తిగా పింఛను లబ్ధిదారులకే కేటాయించబడేలా చూడాలనే ఉద్దేశ్యంతో నేను చాలా ముందుగానే సభాస్థలికి చేరుకున్నాను.
ఈ లక్ష్యంతో లబ్ధిదారులు సభాస్థలిలోకి సక్రమంగా ప్రవేశించడానికి వీలుగా నేను దాదాపు రెండు గంటల పాటు నిల్చున్నాను.
అయితే సాయంత్రం 4:30 గంటలకు జరగాల్సి ఉన్నప్పటికీ కార్యక్రమం సుమారు సాయంత్రం 6:15 గంటల వరకు ప్రారంభం కాలేదు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,
కార్యకర్తలకు వీలు కల్పించడం కోసమే కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసినట్లు అనిపించింది.
ఆ తర్వాత వారిని పోలీసుల రక్షణతో సభాస్థలిలోకి పై అంతస్తులోకి తీసుకువెళ్లారు. ఈ పరిస్థితి ఎదురైనప్పటికీ, మేము మా సహనాన్ని,
సంయమనాన్ని పాటించాము.
తర్వాత జీహెచ్ఎంసీ అధికారుల ఆహ్వానం మేరకు నేను పై అంతస్తుకు వెళ్లాను.అప్పటికే హాలు మొత్తం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నిండిపోయింది వేదిక కూడా కాంగ్రెస్ నాయకులు,పార్టీ కార్యకర్తలతో పూర్తిగా నిండిపోయింది.అయినప్పటికీ అధికారిక కార్యక్రమం ఎటువంటి ఆటంకం లేకుండా సాగేలా చూడాలనే ఉద్దేశ్యంతో నేను వేదికపైకి వెళ్లాను.అధికారులు నాకు మైక్రోఫోన్ ద్వారా మాట్లాడే అవకాశం కల్పించినప్పుడు ఒక అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో తప్పనిసరిగా పాటించాల్సిన నియమావళి గురించి నేను సంబంధిత జోనల్ కమిషనర్‌ను ప్రశ్నించాను.
సరిగ్గా అదే క్షణంలో అప్పటికే అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నాతో దూకుడుగా,
అగౌరవంగా మాట్లాడటం ప్రారంభించి,నా వైపు దూసుకురావడానికి ప్రయత్నించారు.దీంతో అక్కడ ఉద్రిక్తమైన,ఘర్షణపూరిత వాతావరణం నెలకొంది.కాంగ్రెస్ నాయకుల అదుపులేని ప్రవర్తనను నియంత్రించి,
నిర్దేశించిన నియమావళిని పాటించేలా చూడటానికి బదులుగా,పోలీసు అధికారులు నాకు,మా పార్టీ కార్యకర్తలకు వ్యతిరేకంగా వ్యవహరించారు.వారు



దూకుడుగా,పెత్తందారీగా ప్రవర్తించి,మమ్మల్ని వేదిక దిగి ప్రాంగణం విడిచి వెళ్ళమని ఆదేశించారు. అంతేకాకుండా మాపై అనుచితమైన,అవమానకరమైన వ్యాఖ్యలు కూడా చేశారు.పోలీసు సిబ్బంది యొక్క ఇటువంటి ప్రవర్తన తీవ్ర ఆవేదన కలిగించింది మరియు పూర్తిగా ఆమోదయోగ్యం కాదు.అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలకు నిర్దేశించిన నియమావళి ప్రకారం,రాజ్యాంగబద్ధంగా అర్హత కలిగిన ప్రజాప్రతినిధులు మరియు సక్రమంగా అధికారం పొందిన అధికారులు మాత్రమే తమ అధికారిక హోదాలో అటువంటి కార్యక్రమాలలో పాల్గొనడానికి అర్హులని నొక్కి చెప్పడం ముఖ్యం.అయితే పోలీసు సిబ్బంది అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్ద సంఖ్యలో నాయకులను,కార్యకర్తలను చాలా ముందుగానే హాలులోకి ప్రవేశించడానికి అనుమతించి, వేదికను,ప్రాంగణాన్ని పూర్తిగా వారే ఆక్రమించుకునేలా చేశారు.నియమ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించడం గురించి,అధికార పార్టీ నాయకులకు,
కార్యకర్తలకు పక్షపాతంగా వ్యవహరించడం గురించి మేము సంబంధిత అధికారులను ప్రశ్నించినప్పుడు పోలీసు సిబ్బంది మమ్మల్ని వేదిక నుండి ప్రాంగణం నుండి బలవంతంగా బయటకు పంపడానికి బెదిరింపులకు,దురుసు ప్రవర్తనకు,బలవంతపు ప్రయత్నాలకు పాల్పడ్డారు.
ఇలాంటి చర్యలు అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన స్థాపిత నియమావళికి విరుద్ధంగా ఉండటమే కాకుండా పోలీసు అధికారాన్ని ఏకపక్షంగా చట్టవిరుద్ధంగా ఉపయోగించడమే అవుతుంది.
శాంతిభద్రతలను కాపాడటం,ప్రజలను రక్షించడం వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సిన పోలీసు సిబ్బందే ఇలా చేయడం మరింత ఆందోళన కలిగిస్తుంది.
నేను ప్రత్యేకంగా ఈ క్రింది వారి ప్రవర్తనను మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను. దానిలో భాగంగా
1. సైదులు, చైతన్యపురి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్.
2.శ్రీశైలం, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్.
3.రవీందర్ రెడ్డి,ఎల్.బి. నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్.
4.వెంకటేశ్వర్లు -చైతన్యపురి డి.ఐ.
ఈ ఉద్రిక్తతలను సృష్టించి, పెంచడానికి ప్రధానంగా ఈ పోలీసు అధికారులే బాధ్యులు.వారు ఒక నిర్దిష్ట వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తూ అధికార పార్టీ కార్యకర్తలకు అనవసరమైన మద్దతు తెలుపుతూ,
మమ్మల్ని బలవంతంగా వెళ్లిపోమని అడుగుతున్నారు.పోలీసుల ఇటువంటి పక్షపాత,పక్షపాతపూరిత ప్రవర్తన అనవసర ఘర్షణలను రెచ్చగొడుతోంది.బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని,
అన్ని పక్షాలకు నిష్పక్షపాతంగా,న్యాయంగా వ్యవహరించేలా చూడాలని నేను అధికారులను గట్టిగా కోరుతున్నాను.
చట్టాన్ని నిలబెట్టడం,సరైన నియమావళిని పాటించడం, నిష్పక్షపాతంగా వ్యవహరించడం వంటివి చేయాల్సిన పోలీసు అధికారులు,నియోజకవర్గం యొక్క ఎన్నికైన ప్రతినిధిని విస్మరించి,ఏ అధికారిక పదవిలోనూ లేని వ్యక్తులకు అనవసర ప్రాధాన్యతనిస్తూ ప్రవర్తించడం అత్యంత అభ్యంతరకరం.స్థాపించబడిన నియమావళిని ఉల్లంఘించి,అనుచితంగా ప్రవర్తించినట్లు తేలిన అధికారులపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల సమయంలో స్థాపించబడిన ప్రభుత్వ నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పోలీసు అధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి.నియోజకవర్గంలో నిర్వహించే అన్ని అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల షెడ్యూళ్ల గురించి స్థానిక ఎన్నికైన ఎమ్మెల్యేకు సక్రమంగా తెలియజేసి వాటిలో పాల్గొనడానికి తగిన నియమావళి మరియు అవకాశం కల్పించేలా చూడాలి.భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు తీసుకోవాలి ఎల్బీనగర్ శాసనసభ నియోజకవర్గం యొక్క ఎన్నికైన ప్రతినిధిగా, శాసనసభ సభ్యుని పదవికి చట్టబద్ధంగా దక్కాల్సిన గౌరవం అదేవిదంగా నియమావళికి మించి నేను ఎలాంటి ప్రత్యేక హక్కులను కోరడం లేదు.ప్రజాప్రతినిధులను తగిన గౌరవంతో చూడాలని,అధికారిక అధికారం లేని వ్యక్తులు పోలీసు సిబ్బందిని ప్రభావితం చేయకుండా ప్రభుత్వ కార్యక్రమాలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా,గౌరవప్రదంగా నిర్వహించాలని నేను గట్టిగా నమ్ముతున్నాను.అందువల్ల ఈ విషయంలో మీ తక్షణ జోక్యం మరియు అవసరమైన చర్యలు తీసుకోవాలని నేను అభ్యర్థిస్తున్నాను.అనంతరం డిజిపి మాట్లాడుతూ, తప్పకుండా చట్టాలను ఉల్లంఘించిన వారిపై తగు కఠిన చర్యలు తీసుకుంటామని సుధీర్ రెడ్డికి హామీ ఇచ్చారు.భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలు కాకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పట్టణంలోని 25వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం





ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్,(ప్రజావినికిడి):మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులోగల కుంటబడి పాఠశాల ఆవరణలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని చేపట్టిందని తెలిపారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినా,ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా భరోసా కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు.
సామాన్య,పేద,మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని,ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలంటే ప్రజల్లో అవగాహన అవసరమని,పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్ సి. పెంటయ్య, అగ్గనూర్ విశాల,రాజు నాయక్, దిలీప్,మురళి మోహన్ అప్పి,మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, ఇబ్రహీం,రఘు నాయక్,శ్రీశైలం గౌడ్,చందులాల్, ముబారక్ అలీ ఖాన్,సాదిక్, బీరప్ప,రవితేజ, తంగడపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు



చెట్టును డీ కొట్టిన టిప్పర్

వాజేడు,నవంబర్ 21,(ప్రజావినికిడి):
పెద్దగొల్లగూడెం గ్రామ చివరిలో టిప్పర్ చింతచెట్టును డీ కొట్టింది ఐతే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు ఇది శుక్రవారం రాత్రి 8,గంటలకు జరిగినట్లు స్థానికులు చెపుతున్నారు. టిప్పర్ లో డ్రైవర్ మాత్రమే ఉన్నారు చెరుకూరు నుండి పెద్దగొల్లగూడెం వైపు వస్తున్న క్రమంలో డివైడ్ రోడ్డు మధ్యలో డీ కొని రాంగ్ రూట్ లో వచ్చి పక్కనే ఉన్న పొలంలో ఉన్న చింతచెట్టును డీ కోవడంతో చుట్టుపక్కల కుటుంబాలు ఉలిక్కి పడి ఘటన ప్రదేశానికి చేరుకోని పర్శిలించగా అప్పటికే ప్రమాదం జరిగి డ్రైవర్ పారిపోయాడు ఈ టిప్పర్ హైవే రోడ్డు కు సంబందించిందిగా గుర్తించిన స్థానికులు సమాచారం ఇచ్చారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

.. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..

చేవెళ్ల,(ప్రజావినికిడి):
శుక్రవారం చేవెళ్లలోని కేజీర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి,రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని, కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా లేదా సహజంగా మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.ఇప్పటికే రైతులు,గీత కార్మికులు,చేనేత కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులకు వివిధ బీమా పథకాలు అమలులో ఉన్నాయని, ఆయా పథకాల పరిధిలోకి రాని కుటుంబాలకు సైతం బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సహా అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబంలో సంపాదించే వ్యక్తి పేరున జీవిత బీమా నమోదు చేసుకోవచ్చని, బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీకి రూ.5 లక్షల పరిహారం అందజేయడం జరుగుతుందని వివరించారు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని,ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసినప్పుడు వారికి అందాల్సిన బీమా మొత్తంలో వాటాలను నిర్దిష్ట శాతాల్లో నమోదు చేయాలని తెలిపారు. మైనర్‌ను నామినీగా ఎంపిక చేసినప్పుడు సంరక్షకుడి వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలో ప్రత్యేక బృందాల ద్వారా నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.ప్రతి బృందంలో మండల స్థాయి అధికారి,గ్రామ పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్,హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జి ఉంటారని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుందని, అర్హులు బీమా చేయించుకునే వ్యక్తి ఆధార్ కార్డు,రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు కుటుంబ సభ్యులు, నామినీల వివరాలతో శిబిరాలకు హాజరుకావాలని సూచించారు.
జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నెల రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించాలని కోరారు.రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు మొదటి



ప్రాధాన్యతనిస్తూ నమోదు కార్యక్రమం చేపడుతున్నామని,రేషన్ కార్డు ఉన్నవారు తమకు అనుకూలమైన ప్రాంతంలో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రత్యేక నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.
అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే సంక్షేమ కార్యక్రమమని తెలిపారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు భార్యాపిల్లలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ పథకం అండగా నిలుస్తుందన్నారుగతంలో తన బంధువుల కుటుంబం ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు బీమా ద్వారా ఆర్థిక భరోసా లభించిన విషయాన్ని గుర్తుచేశారు. బీమాపై ప్రజల్లో ఉన్న అపోహలు, సంకోచాలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ ఈ పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నమోదు



శిబిరాలు నిర్వహించనున్నందున రేషన్ కార్డు కలిగిన అర్హులైన కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మనం ఉన్నా లేకపోయినా మన కుటుంబ సభ్యులు గౌరవంగా,ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ బీమా నమోదు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.
స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబానికి అండగా నిలుస్తుందని తెలిపారు. సాధారణంగా జీవిత బీమా కోసం ప్రజలు ప్రతి సంవత్సరం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, అయితే ఈ పథకం ద్వారా ప్రభుత్వం కుటుంబ యజమాని పేరున బీమా ప్రీమియం చెల్లించి రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించడం విశేషమన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం పేదలు,రైతులు, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు,పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.చేవెళ్ల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్లు సమత వెంకట్ రెడ్డి, సోనియా,ఆర్డీఓ పార్థసింహారెడ్డి, సీపీఓ సౌమ్య, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, నియోజకవర్గం స్పెషల్ అధికారులు, ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా లబ్ధిదారులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నచింతల సురేందర్ యాదవ్



నాగోల్,(ప్రజావినికిడి):శుక్రవారం రోజు నాగోల్ డివిజన్ పరిధిలోని ఫతులగూడ లో శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో చింతల సురేందర్ యాదవ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో పాటు కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. నూతనంగా ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహాలు భక్తులందరికీ ఆధ్యాత్మిక ఆనందాన్ని, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు వెలికితీసే కథనాలతోనే జర్నలిస్టులకు గుర్తింపు..

టియుడబ్ల్యూజే(ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ..

డేటా సెంటర్లతో కలిగే నష్టాలపై జర్నలిస్టు రమేష్ రాసిన కథనానికి 'ఉత్తమ జర్నలిస్టు' అవార్డు..

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో రమేష్ కు సన్మానం..



షాద్ నగర్,(ప్రజావినికిడి):
ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ, వాస్తవాలను సమాజానికి తెలియజేసే కథనాలతోనే జర్నలిస్టులకు గుర్తింపు వస్తుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ అన్నారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన కలం ద్వారా కృషి చేయడమే నిజమైన జర్నలిజమని ఆయన పేర్కొన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలోనిఎల్లికట్ట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ల వల్ల భవిష్యత్తులో ప్రజలకు, పర్యావరణానికి కలిగే నష్టాలు, స్థానికంగా ఎదురయ్యే ఇబ్బందులపై జర్నలిస్టు రమేష్ తన కథనాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. అభివృద్ధి పేరుతో చేపట్టే ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగుతాయి.? పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడుతుంది.? అనే అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయమన్నారు.ఈ అంశంపై రమేష్ రాసిన కథనాలను గుర్తించి ఆయనకు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానం చేయడం జర్నలిజానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా శుక్రవారం షాద్ నగర్ పట్టణంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, జర్నలిస్టు రమేష్‌ను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ, జర్నలిస్టులు కేవలం వార్తలను ప్రచురించడానికే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు,ప్రజా సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగపడే వార్తలు, సామాజిక బాధ్యతతో కూడిన కథనాలే జర్నలిస్టులకు చిరస్థాయిగా గుర్తింపును తీసుకువస్తాయని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని కొనసాగించాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సామాజిక బాధ్యతతో వార్తా కథనాలు రాస్తున్న జర్నలిస్టు రమేష్‌కు ఉత్తమ జర్నలిస్టు అవార్డు రావడం పట్ల పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై తన కలం పోరాటాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తూ రమేష్‌ను అభినందించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా ఈసీ మెంబెర్ ఇలియాస్,
షాద్ నగర్ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఫయాజ్,ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ నాయక్, ప్రధాన కార్యదర్శి శివకుమార్,ప్రజా దర్బార్ రిపోర్టర్ శివ పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ బీమా లక్ష్యం

పాలమాకులలో పథకం ప్రారంభం.. నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ





శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 20: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం, శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేష్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, పేద కుటుంబాల సంక్షేమం



కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన వారికి నూతనంగా పెన్షన్లు మంజూరు చేసి పంపిణీ చేయడం సంతోషకరమని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు ఆర్థికంగా ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా పెన్షన్లు మంజూరైన అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేష్ గౌడ్,ఉప సర్పంచ్ కుమార్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి,నీరటి రాజు,
సత్యనారాయణ గౌడ్,చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, గుడాల కృష్ణ,రవి నాయక్,ప్రభాకర్ యాదవ్, మోహన్ నాయక్, ప్రభు సాగర్, ప్రభాకర్ యాదవ్, రాళ్లబండి ప్రసాద్ గౌడ్,బాలు ముదిరాజ్, దేవేందర్, మనోజ్,బాలు ముదిరాజ్, దేవేందర్ నాయక్, ఎంపీడీవో మున్ని, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దూసకల్ గ్రామంలో కార్తీక మాసం 12వ రోజున ఘనంగా భజన కార్యక్రమం.. ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న:భజన మండలి సభ్యులు..



షాద్ నగర్,(ప్రజావినికిడి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దూసకల్ గ్రామంలో భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో 12వ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం 12వ రోజు ప్రత్యేక పూజలు కారే వెంకటయ్య యాదవ్ గృహములో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిపారవశ్యంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అనంతరం భజనలు,భక్తి కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.కార్తీక మాసంలో దీపారాధన, భజనలు, పూజలు చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెంపొందడంతో పాటు మనసుకు ప్రశాంతత కలుగుతుందని భక్తులు పేర్కొన్నారు. గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న భజన మండలి సభ్యులను పలువురు అభినందించారు.ఈ పూజా కార్యక్రమంలో భజన మండలి సభ్యులు,గ్రామ భక్తులు పాల్గొని పూజలను విజయవంతంగా నిర్వహించారు.

ఖాకీ ముసుగులో అవినీతి దందా.?

లంచం ఇస్తే ఎలాంటి అక్రమమైనా ఓకేనా.?

ఒక్కో అక్రమానికి ఒక్కో రేటు.. ఎవరు ప్రశ్నిస్తే అక్రమ కేసుల వేటు..

చట్టాన్ని కాపాడాల్సిన చేతులే అవినీతి ఆరోపణల్లో కూరుకుపోతున్నాయా.?

ఏసీబీకి చిక్కితేనే అవినీతి బాగోతం వెలుగులోకి.. లేకుంటే అంతా న్యాయమేనా.?

కల్తీ పన్నీర్ మాఫియాపై చర్యలేవి.? అక్రమాలను వెలుగులోకి తెచ్చిన విలేకరులపైనే కేసులా.?

హైదరాబాద్, (ప్రజావినికిడి):
ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో కొంతమంది అధికారుల వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని కట్టడి చేయాల్సిన ఖాకీ శాఖలోనే కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడే వారికి అండగా నిలుస్తూ, ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేస్తున్నారన్న ఆరోపణలు పోలీసు శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. ఖాకీ యూనిఫాం అధికారానికి గుర్తా.? ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతకు ప్రతీకా.? అనే ప్రశ్నలు ఇప్పుడు సామాన్య ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో అక్రమానికి ఒక్కో రేటు..

పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగే కొన్ని అక్రమ కార్యకలాపాలకు తెరవెనుక లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. లంచాలు అందితే బంధాలు, నిబంధనలు, చట్టాలు అన్నీ పక్కనపెడతారా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులతో ఆర్థికంగా, సన్నిహితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో వ్యవహారానికి ఒక్కో రేటు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ, వాటిపై సమగ్ర విచారణ జరగకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది.

లిఏసీబీకి చిక్కితేనే అవినీతి బయటపడాలా.?లి

అవినీతి నిరోధక శాఖకు అధికారులు పట్టుబడినప్పుడే లంచాల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయా.? అంతకుముందు జరుగుతున్న వ్యవహారాలపై నిఘా ఎక్కడ.? ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అంతర్గత విచారణలు ఎందుకు వేగవంతం కావడం లేదు.? అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు మౌనం వహిస్తే కింది స్థాయి సిబ్బందికి ఎవరు భయపడతారు. ? స్పెషల్ బ్రాంచ్ పూర్తిగా విఫలమయ్యిందా.? అన్న ప్రశ్నలు ప్రజల నుండి ఉత్పన్నమవుతున్నాయి.

స్పెషల్ బ్రాంచ్‌తో సఖ్యత.. శాంతిభద్రతలకు ముప్పు.?

కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది స్పెషల్ బ్రాంచ్ విభాగంలోని వ్యక్తులతో కలిసి వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్పెషల్ బ్రాంచ్, ఏసీబీ,ల్యాండ్ ఆర్డర్,ట్రాఫిక్, ఇంటలిజెన్స్ విభాగాలలో విధులు నిర్వహించే అధికారులు అంతర్గత బదిలీలు అన్ని శాఖలలో తిరగడంతో అధికారుల మధ్య స్నేహభావం ఉండడంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండా ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వడం లేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విధి నిర్వహణలో ప్రజల సేవ,



పారదర్శకత కంటే వ్యక్తిగత పరిచయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎవరు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా తమకు లాభం చేకూరితే చాలు అన్న ధోరణి ఉంటే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది.? ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు,ప్రభుత్వం వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

కల్తీ పన్నీర్ మాఫియాపై చర్యలేవి.? విలేకరులపైనే కేసులా.?

తెలంగాణ రాష్ట్రంలోకల్తీ పన్నీర్ తయారీ, సరఫరా వ్యవహారాలను వెలుగులోకి తెచ్చిన విలేకరులపైనే కేసులు నమోదైన ఘటన పోలీసు శాఖ తీరుపై తీవ్ర విమర్శలకు కారణమవుతోందిప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, అక్రమాలను వెలుగులోకి తెచ్చిన రిపోర్టర్లపైనే కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం.? ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ పన్నీర్ సరఫరాదారులపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదంటేనే అర్థం చేసుకోవచ్చు పోలీసులు మాఫియాలకు ఎంత స్థాయిలో సహకారం అందిస్తున్నారో అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఈ వ్యవహారాన్ని బయటపెట్టిన విలేకరులపై కేసుల నమోదు చర్చనీయాంశంగా మారింది. ప్రజల ఆరోగ్యం కోసం కల్తీలపై పోరాటం చేస్తున్న రిపోర్టర్లని పోలీసులు టార్గెట్ చేయడం వెనుక కల్తీ ఆహార మాఫియా నుండి కొంతమంది పోలీసులకు భారీ స్థాయిలో నజరానా ఉందా.? అన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు కల్తీ పన్నీర్ సరఫరాదారుల పాత్రపై విచారణ ఎక్కడ ఆగింది.? వారిని విచారించారా.? బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు.? అనే ప్రశ్నలకు ఉన్నత అధికారం నుండి సమాధానాలు రావాల్సి ఉంది.

ప్రశ్నిస్తే కేసులు.. అక్రమాలకు పాల్పడితే అండనా.?

పోలీసు శాఖలో జరుగుతున్న అవకతవకలను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధంగా మారుతున్నాయి. తప్పు చేసిన వారిని ప్రశ్నించడం నేరమా.? ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం నేరమా.? అవినీతి ఆరోపణలను బయటపెట్టే జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేస్తే సమాజానికి న్యాయం ఎలా జరుగుతుంది.? లంచాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడేవారికి రక్షణ కల్పిస్తూ, ప్రశ్నించే గొంతులను పోలీసు అధికారులు అణిచివేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే అది పోలీసు వ్యవస్థకే మాయని మచ్చను తెచ్చి పెడుతోంది.

ఉన్నతాధికారులారా.. ఖాకీ గౌరవాన్ని కాపాడండి..

పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ అవినీతిపరులని చెప్పడం సరికాదు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. అయితే కొందరి వ్యవహారశైలి కారణంగా మొత్తం శాఖ ప్రతిష్ఠ మసకబారుతోందిబాధ్యతారాహిత్యం, అవినీతి, నిర్లక్ష్యం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి.కల్తీ పన్నీర్ సరఫరాదారుల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విలేకరులపై నమోదైన కేసుల చట్టబద్ధతను సమీక్షించాలి. అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి.ఖాకీ అంటే అక్రమార్కులకు భయం కలగాలి, బాధితులకు భరోసా కల్పించాలి. అక్రమాలు చేసే వాళ్ళు లంచం ఇచ్చేవాడికి రక్షణ కల్పించడం కాదు.చట్టాన్ని ఉల్లంఘించినవాడికి శిక్ష పడాలి. ప్రశ్నించే గొంతును అణిచివేయడం కాదు.ప్రజలకు జవాబుదారీతనం చూపించాలి. లేదంటే ప్రజలను కాపాడాల్సిన పోలీసు శాఖపైనే ప్రజలు పూర్తి నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని ఉన్నత అధికారులు ప్రభుత్వం గుర్తించి వెంటనే ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విమానాశ్రయంలో ప్రయాణికుడి బ్యాగులో లైవ్ బుల్లెట్ కలకలం

దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన వ్యక్తి బ్యాగేజీలో తూటా గుర్తింపు..



శంషాబాద్, (ప్రజావినికిడి): శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతా తనిఖీల సందర్భంగా ప్రయాణికుడి బ్యాగులో లైవ్ బుల్లెట్ (తూటా) బయటపడటం కలకలం రేపింది. దుబాయ్ వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చిన ఓ ప్రయాణికుడి చెక్‌ఇన్ బ్యాగేజీలో భద్రతా సిబ్బంది తూటాను గుర్తించారు. వివరాల్లోకి వెళితే. జార్ఖండ్ రాష్ట్రం రాంచీకి చెందిన నిర్మల్ బారా (42) దుబాయ్ వెళ్లేందుకు ఈవై359 విమానంలో ప్రయాణించాల్సి ఉంది. ఈ క్రమంలో విమానాశ్రయంలోని భద్రతా తనిఖీల్లో భాగంగా అతని చెక్‌ఇన్ బ్యాగేజ్ ని పరిశీలించగా ఒక లైవ్ రౌండ్ అమ్యూనిషన్ (తూటా) గుర్తించారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆ బ్యాగు దుబాయ్‌లో నివసిస్తున్న తన స్నేహితుడు సూరజ్‌కు చెందినదని నిర్మల్ బారా తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై సంబంధిత అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిర్మల్ బారాపై ఆయుధాల చట్టం (ఆర్మ్స్ యాక్ట్) సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

జూకల్ మాజీ సర్పంచ్ ఏనుగు వేణు రెడ్డి సేవలు చిరస్మరణీయం

తొలి వర్ధంతి కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి నివాళులు

శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 20:
గ్రామాభివృద్ధికి, ప్రజాసేవకు విశేష కృషి చేసిన జూకల్ మాజీ సర్పంచ్ ఏనుగు వేణు రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు గ్రామ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. శంషాబాద్ మండలం జూకల్ గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు వేణు రెడ్డి తొలి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏనుగు వేణు రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఏనుగు వేణు రెడ్డి సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో జూకల్ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేశారని కొనియాడారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి



నిరంతరం కృషి చేసేవారని గుర్తు చేశారు. గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కలిగి, అందరినీ కలుపుకొని ప్రజాసేవలో ముందుండేవారని తెలిపారు. ఆయన చేసిన సేవలు, గ్రామ అభివృద్ధికి అందించిన తోడ్పాటు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి సైతం ఏనుగు వేణు రెడ్డికి నివాళులర్పిస్తూ ఆయన ప్రజాసేవను స్మరించుకున్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ సేవలందించిన నాయకుల ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి



ఒక్కరిపై ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో అంజమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, మానసిక, అంజు రెడ్డి,ఏనుగు హేమలత,ప్రీతి, చంద్రశేఖర్ రెడ్డి, కీర్తి,చంద్రశేఖర్ రెడ్డి,మౌనిక-అంకుస్ రెడ్డి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ఏనుగు వేణు రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

చలి తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికుల ఫేస్ స్కానింగ్ వేళలు మార్చాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో మార్పులు చేయాలి అధికారులకు వినతిపత్రం



శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 20, రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫేస్ స్కానింగ్ సమయాలను మార్చాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ ట్రాన్స్‌పోర్ట్ అదనపు కమిషనర్ ఎం. రవికిరణ్‌తో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ హెల్త్ జాయింట్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం ఉదయం 5:30 నుంచి 6:30 గంటల వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి 2:30 గంటల వరకు ఉన్న ఫేస్ స్కానింగ్ సమయాల్లో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, తెల్లవారుజామున విధులకు హాజరయ్యే పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక మంది కార్మికులు తమ నివాసాల నుంచి సుదూర ప్రాంతాలకు ప్రయాణించి విధులకు హాజరుకావాల్సి వస్తోందని, ఉదయం వేళల్లో చలి తీవ్రత కారణంగా ప్రయాణంతో పాటు విధుల నిర్వహణ కూడా కష్టంగా మారిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఫేస్ స్కానింగ్ సమయాలను సవరించాలని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు చలి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని కార్మికులకు అనుకూలంగా సమయాల్లో మార్పులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జైపాల్ రెడ్డి వెల్లడించారు.

షాద్‌నగర్ పోలీసుల మెరుపు ఆపరేషన్

కేబుల్ వైర్ల దొంగతనాల ముఠా గుట్టురట్టు..

19 కేసుల ఛేదన

నిందితుడు దొడ్డి దుర్గా ప్రసాద్ అరెస్ట్..

రూ.2 లక్షల నగదు స్వాధీనం.

షాద్‌నగర్ జోన్‌తో పాటు పలు ప్రాంతాల్లో టవర్,మోటార్ కేబుల్ వైర్ల చోరీలు..

సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న షాద్‌నగర్ పోలీసులు..

షాద్‌నగర్,(ప్రజావినికిడి):
టవర్ కేబుల్ వైర్లు,మోటార్ కేబుళ్ల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన నిందితుడిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి,వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 19 దొంగతనం కేసులను ఛేదించారు. నిందితుడి నుంచి రూ.2 లక్షల నగదుతో పాటు దొంగతనాలకు ఉపయోగించిన పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 4వ తేదీ రాత్రి చటాన్‌పల్లి గ్రామ సమీపంలోని బుచ్చిగూడ గ్రామ రోడ్డులో ఏఎన్ఆర్ నారాయణ పెట్రోల్ పంపు పక్కన ఉన్న ఇండస్ టవర్‌కు అమర్చిన సుమారు 45 మీటర్ల కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయమై ఇండస్ టవర్స్ సూపర్‌వైజర్ నందిగామ శివకుమార్ ఈ నెల18న షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగిలించబడిన కాపర్ వైర్ విలువ సుమారు రూ.8,500 ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
దీంతో పోలీసులు క్రైమ్ నంబర్ 1013/2026, సెక్షన్



303(2)బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షాద్‌నగర్ జోన్ పరిధిలో వరుసగా జరుగుతున్న టవర్,మోటార్ కేబుల్ వైర్ల దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు ముమ్మరం చేశారు.
ఈ క్రమంలో నవంబర్ 19న నిందితుడు దొడ్డి దుర్గా ప్రసాద్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో షాద్‌నగర్ జోన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది.

19 కేసుల్లో దొంగతనాలు
నిందితుడి విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 కేసులు, కేశంపేటలో 3, కొందుర్గ్‌లో 2, కొత్తూరులో 1, నందిగామలో 1, జడ్చర్లలో 2, భూత్పూర్‌లో 1, జగిత్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తం 19 కేసుల్లో కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు.

రూ.2 లక్షల నగదు స్వాధీనం
దొంగతనాల ద్వారా సంపాదించిన సొమ్ములో నుంచి రూ.2 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వైర్ కట్టర్లు రెండు, వెయింగ్ మిషన్ ఒకటి,రెండు డమ్మీ కామన్ తాళాలు,కరెంట్ టెస్టర్ ఒకటి, ప్లైడింగ్ బ్లేడ్



ఒకటి స్వాధీనం చేసుకున్నారు.
నిందితుడిని తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన దొడ్డి దుర్గా ప్రసాద్ (29)గా పోలీసులు గుర్తించారు. అతను వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.
పోలీసు అధికారుల పర్యవేక్షణలో కేసు ఛేదన
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి,షాద్‌నగర్ డీసీపీ సీహెచ్ శిరీష రాఘవేంద్ర, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్లు కె. సీతారాం,బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు అధికారి జి.శివారెడ్డి, డీఎస్ఐ,క్రైమ్ టీమ్ సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఉన్నతాధికారుల ద్వారా తగిన రివార్డులు అందించనున్నట్లు తెలిపారు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తిఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. గ్రామస్థులు, ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, తమ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తిరస్కరించిన ఫైలుకే మళ్లీ అనుమతుల ముద్ర..

మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్‌లో అంతా తెరవెనుక వ్యవహారాలేనా.?

గతంలో షార్ట్‌ఫాల్ నోటీసులు.. ఇప్పుడు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్..

అనుమతులకు ముందే అంతస్తులు వెలిశాయా.?

ఏసీపీ బాలశ్రీనివాస్ వ్యవహారశైలిపై కాలనీవాసుల అనుమానాలు..

క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే ఫైలు క్లియరెన్సా.?

మల్కాజిగిరి, (ప్రజావినికిడి): సామాన్యుడు ఇంటి నిర్మాణం చేపడితే అడుగడుగునా నిబంధనల పేరుతో అడ్డంకులు సృష్టించే టౌన్ ప్లానింగ్ అధికారులు, లంచాలు ఇచ్చేవారు, పలుకుబడి ఉన్నవారి విషయంలో మాత్రం అదే నిబంధనలను పక్కన పెడుతున్నారా.? మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ విభాగంలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసి, షార్ట్‌ఫాల్ నోటీసులు జారీ చేసిన దరఖాస్తుకే ఇప్పుడు అనుమతులు మంజూరు కావడం వెనుక అసలు కథ ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

తిరస్కరణ నుంచి అనుమతి వరకు.. మధ్యలో ఏమి జరిగింది.?

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ, ఇంటి నంబర్ 10-236/1 భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం వివాదంలో చిక్కుకుంది. సరైన పత్రాలు లేవని, నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు లేవని గతంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాలశ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ షార్ట్‌ఫాల్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తం చేసిన అధికారులు ఇప్పుడు అదే స్థలానికి స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరు చేశారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

ముందే నిర్మాణం.. తర్వాత అనుమతుల ఆమోదమా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం ఎసిపి బాల శ్రీనివాస్ అవినీతి ఒక్కొకటిగా బయటపడుతుందని సదరు భవనంలో అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు చేపట్టి ఇప్పటికే మూడు అంతస్తుల వరకు నిర్మాణం కొనసాగించారు. నిర్మాణ స్థితిపై స్పష్టత లేకుండానే అనుమతులు మంజూరు చేశారా.? గతంలో నిబంధనలకు విరుద్ధమని గుర్తించిన అంశాలు ఇప్పుడు ఎలా సరిదిద్దబడ్డాయి.? క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా.? లేక కేవలం కాగితాలపైనే పరిశీలన పూర్తి చేశారా.? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



పైరవీ చేస్తే నిబంధనలే మారిపోతాయా.?

సాధారణ ప్రజలు భవన అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా చిన్నచిన్న అభ్యంతరాలతో ఫైళ్లు నిలిచిపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో ఈ భవనం విషయంలో అనుమతుల ప్రక్రియ ఎలా ముందుకు సాగిందన్నది చర్చకు దారితీసింది. మధ్యవర్తుల జోక్యం, ఆర్థిక లావాదేవీల కారణంగానే ఫైలు వేగంగా కదిలిందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో




అనుమతుల వెనుక ఏమైనా అక్రమాలు జరిగాయా.? అన్నది ఏసీబీ, విజిలెన్స్ అధికారుల విచారణలోనే తేలాల్సి ఉంది.

ఓపెన్ ప్లాట్ పేరుతో అసలు వాస్తవాలు దాచారా.?

దరఖాస్తులో స్థలాన్ని ఖాళీ స్థలంగా చూపించారా.? వాస్తవంగా నిర్మాణం ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించారా.? గతంలో అభ్యంతరాలకు కారణమైన సెట్‌బ్యాక్‌లు ప్రస్తుతం ఎలా పరిగణనలోకి తీసుకున్నారు.? అనుమతులు జారీ చేసే ముందు భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారా.? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. దరఖాస్తులో పేర్కొన్న వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు సరిపోలుతున్నాయో లేదో ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అధికారుల ఫైళ్లకు విచారణ ఉండదా.?

గతంలో తిరస్కరించిన దరఖాస్తుకు ఇప్పుడు అనుమతులు మంజూరు కావడంపై జీహెచ్ఎంసీ మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్, కమిషనర్,సీసీపీ ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని



OFFICE OF THE MALKAJGIRI MUNICIPAL CORPORATION
BuildNow
SHORTFALL LETTER

To,

Sri ARRAVELLI MAHENDER GOUD	Notice No: 046811/MMC/01178/IABP/C5/2026
S/o SRLA. SIDDAIAH	Date: 02/04/2026
H.NO. 9-57, VENKATESWARA NAGAR, MALKAJGIRI, MEDCHAL MALKAJGIRI DIST. TELANGANA-500 047. TELANGANA	

Dear Sir /Madam,

Sub: Malkajgiri Municipal Corporation - Proposed Construction of **Individual Residential Building** consisting of **Stilt for Parking + 2 Upper Floor** , to an extent of **198.57 Sq mt.** situated at Plot No: **HOUSE NO.10-236AND1, OLD NOS. 27-153AND4 AND 8-72AND66 ON PLOT NO. 4,** , locality: **VENKATESHARA NAGAR** , Survey No: **707** , Village **Malkajgiri** , **Malkajgiri Circle 5** , **Malkajgiri Zone** , **Malkajgiri Mandal** , **Medchal - Malkajgiri District** Shortfall Letter for misrepresentation of facts while obtaining the Building Permission under Registration/ Instant Approval – Issued - Reg

Ref: 1. Provisional Building permission issued under Instant Registration / Instant approval vide no : **046811/MMC/01178/IABP/C5/2026** dated: **17/03/2026** through the BuildNow application.
2. G.O.Ms.No. 168 MA&UD;, Dt.07-04-2012.
3. G.O.Ms.No.7 MA&UD;, Dt.05-01-2016.
4. G.O.Ms.No. 200 GHMC, Dt.16-11-2020.
5. TGbPASS Act (Act 12 of 2020),Dt. 19-11-2020.
6. MA & UD Memo. No. 8782/plg.111/2022. Dated 26.07.2022

The Provisional permission obtained for construction of individual Residential Building vide reference 1st cited, has been examined in detail by the Post Verification team as per the rules and regulations in force. It is noticed that it has been obtained by suppressing the material facts and by misrepresentation of documents facts as stated below:

Shortfall Remarks: Line Department Triggering Checklist

1. Inspected the site and verified the document it is observed that the applicant has not submitted link document & submitted mortgage deed and also re-verify undertaking. Hence, the submitted proposals may be suggested for shortfall.

కాలనీవాసులు కోరుతున్నారు. అనుమతుల ఫైల్లో సమర్పించిన పత్రాలు,గతంలో జారీ చేసిన షార్ట్‌ఫాల్ నోటీసులు, ప్రస్తుత నిర్మాణ స్థితి,సెట్‌బ్యాక్‌ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
నిబంధనలు సామాన్యులకేనా.? పలుకుబడి ఉన్నవారికి ప్రత్యేక మార్గాలున్నాయా.? అనుమతుల మంజూరులో ఎలాంటి అక్రమాలు జరగలేదని డిప్యూటీ కమిషనర్,టౌన్ ప్లానింగ్ అధికారులు ఆధారాలతో నిరూపించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఏపీఈసీ సదస్సు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మలుపు

● అగ్రదేశాల ఆధిపత్య పోరు.. వాణిజ్య సహకారానికి పరీక్ష

నవంబర్ 20.(ప్రజావినికిడి):

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న అనిశ్చితి, అగ్రదేశాల మధ్య వాణిజ్య పోటీ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఏపీఈసీ సదస్సు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆసియాపసిఫిక్ ప్రాంతం ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో ఈ సదస్సు చర్చలు, నిర్ణయాలు అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలపై ప్రభావం చూపనున్నాయి. అమెరికా, చైనా మధ్య ఆధిపత్య పోరు, వాణిజ్య ఆంక్షలు, సుంకాల విధింపులు ప్రపంచ దేశాలను కొత్త ఆర్థిక వ్యూహాల వైపు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, వాణిజ్య స్వేచ్ఛను కాపాడటం అత్యంత అవసరం.ప్రపంచీకరణతో దేశాల ఆర్థిక వ్యవస్థలు పరస్పరం అనుసంధానమయ్యాయి. ఒక దేశంలో ఉత్పత్తి రంగం మందగించినా, ముడిసరుకు సరఫరాలో అంతరాయం ఏర్పడినా దాని ప్రభావం అనేక దేశాలపై పడుతోంది. ఎగుమతులు, దిగుమతులు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలు అంతర్జాతీయ సంబంధాల్లో కీలకంగా మారాయి. అయితే అగ్రదేశాలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం అనుసరిస్తున్న విధానాలు ప్రపంచ వాణిజ్యానికి సవాళ్లు విసురుతున్నాయి. సుంకాల పెంపు, వాణిజ్య



ఆంక్షలు, దేశీయ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధానాలు మార్కెట్లలో అస్థిరతకు దారితీస్తున్నాయి. వీటి ప్రభావం అభివృద్ధి చెందుతున్న దేశాలపై మరింత తీవ్రంగా పడుతోంది. ఉత్పత్తి వ్యయాలు పెరగడం, పెట్టుబడులు తగ్గడం, ఎగుమతి అవకాశాలు పరిమితం కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న పోటీ కేవలం వాణిజ్య రంగానికే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, డిజిటల్ రంగాల్లోనూ విస్తరించింది. ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం సాధించేందుకు అగ్రదేశాలు అనుసరిస్తున్న వ్యూహాలు ఇతర దేశాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. సరఫరా వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకోవడం, కీలక సాంకేతిక రంగాలపై నియంత్రణ సాధించడం, పెట్టుబడుల ప్రవాహాలను ప్రభావితం చేయడం వంటి ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఈ పోటీ ప్రపంచ దేశాలకు అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ, ఆర్థిక విభజనకు దారితీసే ప్రమాదం కూడా ఉంది. దేశాలు వేర్వేరు వాణిజ్య కూటములుగా విడిపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది.ఏపీఈసీ వేదిక చిన్న, మధ్యస్థాయి దేశాలకు కూడా ఎంతో కీలకమైనది. అగ్రదేశాల మధ్య కుదిరే ఒప్పందాలు, విధాన నిర్ణయాలు చిన్న దేశాల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయకుండా చూడాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమాన అవకాశాలు కల్పించడం, వాణిజ్య అడ్డంకులను తగ్గించడం, పెట్టుబడులను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించాలి. పెద్ద ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాలకే పరిమితమయ్యే విధానాలు ప్రపంచ దేశాల మధ్య అసమానతలను మరింత పెంచుతాయి. అందుకే సమాన భాగస్వామ్యం, పారదర్శక వాణిజ్య విధానాలు, పరస్పర ప్రయోజనకర ఒప్పందాలు అవసరం.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. కృత్రిమ మేధ, డిజిటల్ వాణిజ్యం, ఆధునిక తయారీ రంగాలు భవిష్యత్ ఆర్థిక అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయి. ఈ రంగాల్లో సహకారం పెరిగితే దేశాలకు అభివృద్ధి అవకాశాలు విస్తరిస్తాయి. కానీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధిపత్య సాధనంగా ఉపయోగించడం, ఇతర దేశాలకు అందుబాటును పరిమితం చేయడం వల్ల అభివృద్ధి అసమానంగా మారుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, డిజిటల్ భద్రత, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య సరఫరా వ్యవస్థల అస్థిరత. యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య ఆంక్షలు, ప్రకృతి వైపరీత్యాలు సరఫరా వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి. దీని ప్రభావం వస్తువుల ధరలు, పరిశ్రమల ఉత్పత్తి, వినియోగదారులపై పడుతోంది. ఒకే దేశంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడం, ప్రాంతీయ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం అవసరం. ఏపీఈసీ దేశాలు పరస్పర సహకారంతో ఈ సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలి.అగ్రదేశాల మధ్య పోటీ సహజమే అయినప్పటికీ, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే స్థాయికి చేరకూడదు. దేశాల మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, వాణిజ్య సంబంధాలను కొనసాగించడం, అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించడం అవసరం. ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకురావడం కంటే పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే విధానాలు అనుసరించాలి. ప్రపంచ దేశాల అభివృద్ధి ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నందున, ఏ ఒక్క దేశం ఒంటరిగా స్థిరమైన ఆర్థిక ప్రగతిని సాధించడం కష్టమే.ఏపీఈసీ సదస్సు కేవలం చర్చల వేదికగా మిగిలిపోకుండా, ఆచరణాత్మక నిర్ణయాలకు కేంద్రంగా మారాలి. వాణిజ్య అడ్డంకుల తగ్గింపు, పెట్టుబడుల ప్రోత్సాహం, సాంకేతిక సహకారం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మద్దతు వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి. అగ్రదేశాల ఆధిపత్య పోరుకు బదులుగా సమాన భాగస్వామ్యం, సహకారం, శాంతియుత వాణిజ్యానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని సాధించగలదు. దేశాల మధ్య పోటీ అభివృద్ధికి దోహదపడాలి తప్ప, సంక్షోభాలకు కారణం కాకూడదు. ఇదే ఏపీఈసీ సదస్సు ప్రపంచానికి అందించాల్సిన ప్రధాన సందేశం.

అమెరికా కలకు అడ్డంకులు!

- గ్రీన్‌కార్డ్ నిబంధనల కఠినతరం.. భారతీయ ఐటీ నిపుణుల్లో ఆందోళన

నవంబర్ 20.(ప్రజావినికిడి):

అమెరికాలో స్థిరపడాలన్న భారతీయ యువత, ఉద్యోగులు, ఐటీ నిపుణుల కలలకు ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అడ్డంకులుగా మారుతున్నాయి. ఒకప్పుడు ఉన్నత విద్య, మంచి ఉద్యోగం, అధిక వేతనం, మెరుగైన జీవితం కోసం అమెరికా వెళ్లడం భారతీయ యువతకు ప్రధాన ఆకర్షణగా ఉండేది. అక్కడ ఉద్యోగం సంపాదించి, కొన్నేళ్లలో గ్రీన్‌కార్డ్ పొంది కుటుంబంతో సహా శాశ్వతంగా స్థిరపడాలన్నది లక్షలాది మంది ఆశయం. కానీ ప్రస్తుతం అమెరికా అనుసరిస్తున్న వలస విధానాలు ఈ ఆశలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డుల జారీ ప్రక్రియను కఠినతరం చేయడం, విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థలపై ఆంక్షలు విధించడం భారతీయ నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 'అమెరికన్లకే ప్రాధాన్యం' అనే విధానానికి పెద్దపీట వేస్తోంది. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో విదేశీ ఉద్యోగుల నియామక ప్రక్రియను మరింత కఠినతరం చేస్తోంది. ఫిజికల్ థెరపిస్టులు, నర్సుల నుంచి ఐటీ, సాంకేతిక రంగాల్లో అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగుల వరకు ఈ మార్పుల ప్రభావం పడే అవకాశం ఉంది. విదేశీ ఉద్యోగులను శాశ్వతంగా నియమించుకునే ముందు అమెరికా పౌరులకు తగిన అవకాశాలు కల్పించారా? స్థానికంగా అర్హులైన ఉద్యోగులు అందుబాటులో ఉన్నారా? అనే అంశాలను కంపెనీలు మరింత స్పష్టంగా నిరూపించాల్సి ఉంటుంది. దీంతో విదేశీ ఉద్యోగులకు గ్రీన్‌కార్డ్ స్పాన్సర్ చేయడం సంస్థలకు కష్టతరంగా మారనుంది.**గ్రీన్‌కార్డ్ ప్రక్రియలో మార్పులు** అమెరికాలో శాశ్వత నివాస హోదా పొందేందుకు గ్రీన్‌కార్డ్ కీలకమైనది. ఇది లభిస్తే అక్కడ దీర్ఘకాలికంగా నివసించడంతో పాటు ఉద్యోగం చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డుల మంజూరులో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (ప్రూ=వీ) విధానాన్ని అమెరికా కార్మిక శాఖ మరింత కఠినతరం చేసే చర్యలు చేపడుతోంది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఈ విధానంలో ప్రధాన మార్పులు తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యోగ ప్రకటనలు, నియామక ప్రక్రియ, స్థానిక అభ్యర్థుల ఎంపిక, విదేశీ ఉద్యోగుల అర్హతల పరిశీలన వంటి అంశాల్లో కంపెనీలపై అదనపు బాధ్యతలు పడనున్నాయి. ఇప్పటికే గ్రీన్‌కార్డ్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారికి ఈ మార్పులు మరింత నిరాశ కలిగించే అవకాశముంది.**భారతీయ ఐటీ నిపుణులకు ఎదురుదెబ్బ** అమెరికాలో భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది.



ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, సమాచార సాంకేతిక, వైద్య, పరిశోధన, ఇంజినీరింగ్ రంగాల్లో భారతీయులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెచ్-1బీ వీసాల ద్వారా అమెరికాకు వెళ్లిన వేలాది మంది ఉద్యోగులు అక్కడే స్థిరపడాలని భావిస్తున్నారు. అయితే గ్రీన్‌కార్డ్ మంజూరులో ఉన్న పరిమితులు, భారతీయులకు అధిక సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వల్ల పరిస్థితి ఇప్పటికే సంక్లిష్టంగా మారింది. ఇప్పుడు కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే ఈ సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ శాశ్వత నివాస హోదా లేకపోవడం వల్ల ప్రతి వీసా పొడిగింపు సమయంలోనూ అనిశ్చితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉద్యోగం మారాలన్నా, కుటుంబ భవిష్యత్తు గురించి నిర్ణయం తీసుకోవాలన్నా అనేక పరిమితులు ఎదురవుతున్నాయి.**ఐటీ సంస్థలపై ఆంక్షలు.. ఉద్యోగులకు ఆందోళన** భారతీయ ఐటీ రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు అమెరికాలో భారీ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ వంటి సంస్థల ద్వారా వేలాది మంది భారతీయులు అమెరికాలో ఉపాధి పొందుతున్నారు. ఈ సంస్థలపై గ్రీన్‌కార్డ్ స్పాన్సర్‌షిప్, ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఆంక్షలు విధించే పరిణామాలు ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీలు విదేశీ ఉద్యోగులను నియమించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే కొత్త నియామకాలు తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల గ్రీన్‌కార్డ్ దరఖాస్తులపైనా ప్రభావం పడవచ్చు. కంపెనీలకు అనిశ్చితి ఏర్పడితే ఉద్యోగుల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకమవుతుంది. ఈ పరిస్థితి భారతీయ ఐటీ రంగానికి కూడా సవాలుగా మారనుంది. **179 ఏళ్ల నిరీక్షణ.. భారతీయులకు గ్రీన్‌కార్డ్ అందని ద్రాక్ష!** అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం భారతీయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య దీర్ఘకాల నిరీక్షణ. దేశాల వారీగా కేటాయించే పరిమితులు, దరఖాస్తుల సంఖ్యలో భారీ వ్యత్యాసం కారణంగా భారతీయుల దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. కొన్ని అంచనాల ప్రకారం ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు భారతీయ దరఖాస్తుదారులకు గ్రీన్‌కార్డ్ రావడానికి 179 సంవత్సరాల వరకు పట్టవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది ప్రతి ఒక్కరి నిరీక్షణ సమయం కాకపోయినా, వ్యవస్థలో ఉన్న తీవ్ర అసమానతను తెలియజేస్తోంది. ప్రతిభ, అర్హత, అనుభవం ఉన్నప్పటికీ కేవలం దేశాల వారీ కోటా కారణంగా జీవితకాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి అన్యాయంగా కనిపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అమెరికా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.**పబ్లిక్ ఛార్జ్ నిబంధనతో మరో సమస్య** గ్రీన్‌కార్డ్ దరఖాస్తుల పరిశీలనలో పబ్లిక్ ఛార్జ్ నిబంధన కూడా కీలకంగా మారుతోంది. దరఖాస్తుదారులు భవిష్యత్తులో ప్రభుత్వ ఆర్థిక సహాయంపై ఆధారపడే అవకాశం ఉందా? వారి ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? అప్పులు, ఆదాయం, కుటుంబ బాధ్యతలు ఏమిటి? వంటి అంశాలను అధికారులు పరిశీలించే అవకాశం ఉంది. దీనివల్ల దరఖాస్తుదారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్నిసార్లు అవసరమైన అర్హతలు ఉన్నప్పటికీ అదనపు పరిశీలనలు, పత్రాల సమర్పణ, విచారణల కారణంగా దరఖాస్తులు ఆలస్యమవుతున్నాయి. ఇమ్మిగ్రేషన్ అధికారులు నివాసాలను సందర్శించడం, సంబంధిత వివరాలను ధ్రువీకరించడం వంటి చర్యలు కూడా విదేశీ కుటుంబాల్లో ఆందోళన పెంచుతున్నాయి.**కుటుంబాల భవిష్యత్తుపై సందిగ్ధత** అమెరికాలో ఉద్యోగం చేస్తున్న భారతీయుల సమస్య కేవలం వ్యక్తిగత ఉద్యోగ భద్రతకు మాత్రమే పరిమితం కాదు. అక్కడే చదువుకుంటున్న పిల్లలు, ఉద్యోగాలు చేస్తున్న జీవిత భాగస్వాములు, కుటుంబ ఆర్థిక బాధ్యతలు అన్నీ ఈ నిర్ణయాలతో ముడిపడి ఉన్నాయి. గ్రీన్‌కార్డ్ వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో పిల్లల విద్య, భవిష్యత్తు, ఆస్తుల కొనుగోలు, కుటుంబ స్థిరత్వం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతోంది. హెచ్-1బీ వీసా కొనసాగింపుపై అనిశ్చితి నెలకొంటే ఒక్కసారిగా దేశం విడిచి రావాల్సిన పరిస్థితి కూడా ఏర్పడవచ్చు. ఇన్నేళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఇది మానసికంగా, ఆర్థికంగా పెద్ద దెబ్బ. అందుకే కొందరు భారతీయులు అమెరికాలో కొనసాగడం కంటే స్వదేశానికి తిరిగి రావడమే మంచిదనే ఆలోచనకు వస్తున్నారు.**అమెరికాకే నష్టమా?** విదేశీ ఉద్యోగులపై ఆంక్షలు విధించడం వల్ల అమెరికాలోని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

రూ.9 కోట్ల మందు రూ.2.5 లక్షలే..

పసిపిల్లల ప్రాణాల కోసం పోరాడిన హైదరాబాద్ డాక్టర్!

హైదరాబాద్ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ మానవతా ప్రయత్నం ఫలప్రదం

నవంబర్ 20.(ప్రజావినికిడి):



కళ్ల ముందే కన్నబిడ్డ కరిగిపోతుంటే చూస్తూ తల్లడిల్లిపోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత.. తమ బిడ్డను బతికించుకునే మందు ఉందని తెలిసినా, అది కొండంత ధరతో సామాన్యుడికి అందనంత దూరంలో ఉండటం ఆ తల్లిదండ్రులకు అంతకంటే తీరని శాపం. అలన్-హెర్న్‌డన్-డడ్లీ సిండ్రోమ్ (ఏహెచ్‌డీఎస్) అనే అరుదైన జన్యు సమస్యతో నరకయాతన అనుభవిస్తున్న పసిపిల్లల తల్లిదండ్రుల గుండెకోత ఇది. ఏడాదికి ఏకంగా రూ.9 కోట్లు ఖర్చయ్యే 'టిరాట్రికోల్' ఔషధాన్ని కొనుగోలు చేయడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు కలలో కూడా ఊహించని భారం. ఆ పసికందుల ప్రాణాల కోసం, కన్నీటి సాగరంలో మునిగిన కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ఓ వైద్యురాలు కదిలారు. దైవంలా ఆదుకోవడానికి నడుం బిగించారు.హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ అలుపెరగని పోరాటం చేశారు. యాక్సిస్ టు మెడిసిన్స్ ఇండియా సంస్థతో చేతులు కలిపి ఔషధ కంపెనీలతో పోరాడారు. బిడ్డల ప్రాణాల విలువ ముందు ఈ కోట్ల కొలతలు ఎందుకని ప్రశ్నిస్తూ అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆమె నిరంతర సంకల్పం ముందు అసాధ్యమనుకున్నది సుసాధ్యమైంది. అమాంతం రూ.9 కోట్లు పలికే ఆ మందు ఖర్చును ఏకంగా రూ.2.5 లక్షలకు తగ్గించడంలో అద్భుత విజయం సాధించారు. కోట్లలో ఉన్న ధరను లక్షల్లోకి తీసుకువచ్చి ఎన్నో కుటుంబాలకు బతుకుపై భరోసా కల్పించారు.

ధర తగ్గించడంతోనే ఆమె ప్రయత్నం ఆగిపోలేదు. ఈ అరుదైన నరాల వ్యాధితో పోరాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న ఏడుగురు చిన్నారులకు ఏడాదికి సరిపడా 'టిరాట్రికోల్' ఔషధాన్ని ఉచితంగా అందించేందుకు కూడా ఏర్పాట్లు పూర్తి చేశారు. నవంబర్ 30న ఈ ఏడుగురు చిన్నారుల కుటుంబాలకు మందులను అందజేయనున్నారు. మగపిల్లల్లో కండరాల క్షీణత, ఎదుగుదల లోపాన్ని మిగిల్చే ఈ రాకాసి వ్యాధిపై పోరాడుతున్న చిన్నారులకు డాక్టర్ శివరంజని చూపిన మానవతా దృక్పథం కొత్త ఊపిరి పోసింది.

భారీగా పతనమైన బంగారం, వెండి ధరలు



నవంబర్ 20.(ప్రజావినికిడి):

బంగారం, వెండి ధరలు నేడు భారీగా పతనమయ్యాయి. అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడితో పసిడి, వెండి ధరలు బహుళ నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఫ్యూచర్స్ మార్కెట్‌తో పాటు రిటైల్ మార్కెట్‌లోనూ ఈ తగ్గుదల స్పష్టంగా కనిపించింది.

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు సుమారు రూ.5,000 పతనమై రూ.1,22,430 వద్ద ట్రేడ్ అయింది. వెండి ఫ్యూచర్స్ ధర మరింత ఎక్కువగా పడిపోయింది. కిలోకు రూ.9,000 పైగా తగ్గి రూ.1,48,424 వద్దకు చేరింది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది. కామెక్స్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4 శాతానికి పైగా తగ్గి 3,525 డాలర్లకు పడిపోయింది. వెండి ధర 7 శాతానికి పైగా నష్టపోయి ఔన్సుకు 41.25 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అమెరికా డాలర్ బలపడటం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాల అంచనాలు పసిడిపై ఒత్తిడి పెంచాయి.దేశీయ రిటైల్ మార్కెట్లలోనూ ధరలు తగ్గాయి. ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర సుమారు రూ.1,23,120గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,12,653, 18 క్యారెట్ల బంగారం రూ.92,340 వద్ద పలికింది. కిలో వెండి ధర రూ.1,48,730 వద్ద ఉంది. స్థానిక పన్నుల కారణంగా నగరాల మధ్య ధరల్లో స్వల్ప తేడాలు ఉన్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం కూడా దేశీయంగా ధరలు తగ్గడానికి ఒక కారణమని, ఇది దిగుమతుల వ్యయాన్ని తగ్గిస్తుందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. ఈ తాజా పతనం ఆభరణాల కొనుగోలుదారులకు కొంత ఊరటనిస్తోంది.

డ్రెస్ కోడ్ పేరుతో అయ్యప్ప స్వామికి నో ఎంట్రీ..

హైదరాబాద్ టీసీఎస్ వద్ద భగ్గుమన్న నిరసన!

నవంబర్ 20.(ప్రజావినికిడి):

రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలోని ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కార్యాలయం వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయ్యప్ప దీక్ష ధరించిన ఓ టెక్కీని కార్యాలయంలోకి అనుమతించకపోవడంతో ఆందోళన చెలరేగింది. కంపెనీ యాజమాన్య వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు క్యాంపస్ గేటు ఎదుట బైఠాయించి నినాదాలతో హోరెత్తించారు. దీక్షలో ఉన్న ఉద్యోగిని విధులకు అనుమతించాలని గట్టిగా డిమాండ్ చేశారు.గత రెండేళ్లుగా టీసీఎస్‌లో పనిచేస్తున్న మనీష్ అనే ఉద్యోగి గురువారం నల్లటి దీక్షా వస్త్రాలతో ఆఫీసుకు వచ్చారు. అయితే కంపెనీ డ్రెస్ కోడ్ నిబంధనల



పేరుతో సెక్యూరిటీ సిబ్బంది ఆయన్ను గేటు వద్దే అడ్డుకున్నారు. దీనిపై మనీష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నేను అయ్యప్ప దీక్ష తీసుకుంటున్న విషయాన్ని రెండు నెలల క్రితమే కంపెనీ మేనేజ్‌మెంట్‌కు స్పష్టంగా తెలిపాను. తీరా ఈరోజు ఆఫీసుకు వస్తే డ్రెస్ కోడ్ పాటించలేదంటూ నన్ను లోపలికి రానివ్వలేదు. డ్రెస్ కోడ్ పాటించని ఇతర ఉద్యోగులను మాత్రం విధులకు అనుమతిస్తున్నారు. అయ్యప్ప దీక్షలో ఉన్నందుకే నన్ను ఎందుకు టార్గెట్ చేసి అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదు" అని ఆయన వాపోయారు.ఈ విషయం బయటకు రావడంతో అయ్యప్ప భక్తులు సంస్థ ముట్టడికి దిగారు. రంగంలోకి దిగిన ఆదిభట్ల పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. టెక్కీ చేసిన ఆరోపణల నేపథ్యంలోనే నిరసన జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని, ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని, వాస్తవాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



విజయ్ సేతుపతి రూట్లో నస్లెన్

'ప్రేమలు'లో అమాయకమైన లవర్ బాయ్‌గా కనిపించిన నస్లెన్ ఇప్పుడు సూర్యకే విలన్‌గా మారిపోయారు. 'సీన్' సినిమాలో ఈశ్వరన్ పాత్రతో తనలోని మరో యాంగిల్ చూపించారు. అంతకుముందు 'లోకా'లో కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి నటించారు. ఇప్పుడు 'బ్యాచిలర్ పార్టీ డ్యూక్స్'లోనూ పెద్ద తారాగణంతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. హీరోగా మంచి క్రేజ్ వచ్చినా సోలో సినిమాల కోసమే ఎదురుచూడకుండా ఇలా విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్న తీరు చూస్తుంటే విజయ్ సేతుపతి గుర్తుకొస్తున్నారు. విజయ్ సేతుపతి కూడా తన కెరీర్‌లో హీరో పాత్రలకే పరిమితం కాలేదు. '96'లో ప్రేమికుడిగా మెప్పించిన ఆయన 'విక్రమ్ వేద', 'మాస్టర్', 'విక్రమ్', 'జవాన్' సినిమాల్లో నెగెటివ్ పాత్రలతో అదరగొట్టారు. మరోవైపు 'మహారాజ'తో సోలో హీరోగానూ భారీ విజయం అందుకున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటించడానికి ఎప్పుడూ వెనకాడలేదు. పాత్ర నచ్చితే తన ఇమేజ్ గురించి పెద్దగా పట్టించుకోకుండా సినిమాలు చేయడం సేతుపతికి బాగా కలిసొచ్చింది. ఇప్పుడు నస్లెన్ కూడా దాదాపు అలాంటి రూట్‌లోనే వెళ్తున్నారు. 'ప్రేమలు'తో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించిన తర్వాత వరుస ప్రేమకథలు చేసే అవకాశం ఉన్నా, సూర్య 'సీన్'లో సైకో కిల్లర్ పాత్రకు ఓకే చెప్పారు. దర్శకుడు జీతూ మాధవన్ కూడా నస్లెన్ లాంటి యంగ్ హీరో ఈ పాత్రకు అంగీకరిస్తారా అని మొదట అనుకున్నారట. కానీ నస్లెన్ తన కొత్త ఇమేజ్‌ను వదిలి ఇంత డార్క్ క్యారెక్టర్ చేయడం విశేషం. అయితే విజయ్ సేతుపతి జర్నీలో నస్లెన్ నేర్చుకోవాల్సిన మరో విషయం కూడా ఉంది. ఒక దశలో సేతుపతికి విలన్ ఆఫర్లు ఎక్కువయ్యాయి. స్టార్ హీరోల సినిమాల్లో తన సన్నివేశాలు ఎడిటింగ్‌లో తగ్గిపోయిన సందర్భాలున్నాయని కూడా చెప్పారు. దీంతో కొంతకాలం విలన్ పాత్రలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నస్లెన్ కూడా వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు చేస్తే, హీరోగా సంపాదించుకున్న గుర్తింపు కంటే నెగెటివ్ క్యారెక్టర్లకే డిమాండ్ పెరిగే ఛాన్స్ ఉంది.

పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సమంత..



ప్రముఖ నటి సమంత మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తున్నారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సమంత, ఆమె భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.బాబు చిన్ని వేళ్లు సమంత వేలిని పట్టుకున్న అపురూపమైన చిత్రాన్ని పంచుకుంటూ తమ కుమారుడి పేరును 'దేవ్ నిడిమోరు'గా ఖరారు చేసినట్లు ప్రకటించారు. 2026 నవంబరు 19న తమ బాబు జన్మించాడని, ఈ సమయం తమ జీవితంలోనే అత్యంత ఆనందకరమైన క్షణమని ఈ జంట భావోద్వేగంతో రాసుకొచ్చారు.బాబు రాకకు ముందే, నవంబరు 17న వీరి ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, సుఖ ప్రసవం కోసం 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పేరుతో వేడుక జరిగింది. ఈ పూజలో సమంత ఎరుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరవగా, రాజ్ క్రీమ్ కలర్ కుర్తా, తెల్లటి పైజామాలో కనిపించారు. కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, శ్రీసూక్తం, గాయత్రీ దేవి హోమంలో వారు పాల్గొన్నారు.ఈ వేడుక విశేషాలను రాజ్ సోదరి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబంలోని పిన్నమ్మలు, పెద్దమ్మలు అందరూ ఒకచోట చేరి సమంతకు, పుట్టబోయే బిడ్డకు దీవెనలు అందించారని ఆమె పేర్కొన్నారు. పద్మశ్రీ శోభారాజు ప్రత్యేకంగా స్వరపరిచిన గీతాన్ని కుటుంబ సభ్యులు ఆలపించి వేడుకను మరింత ఘనంగా మార్చారు.సమంత, రాజ్‌లు 2025 డిసెంబరు 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ లింగ భైరవి ఆలయంలో అత్యంత సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ', 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాల్లో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఆ తర్వాత 2026 జూన్‌లో తాను గర్భవతినన్న విషయాన్ని వెల్లడించిన సమంత, 'మా ఇంటి బంగారం' చిత్రం అనంతరం ప్రసవం కోసం నటన నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు బాబు రాకతో ఆ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

ఆకలేస్తే చిరంజీవి గారి ఇంటికెళ్లి భోజనం చేసేవాడిని
: నాజర్ భావోద్వేగం



సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నాజర్, తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు, ఆ తర్వాత అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో ఎన్నో ఆకలి రోజులను చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్లిష్ట సమయంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం తనకు అందించిన మద్దతును ఆయన ఎంతో భావోద్వేగంతో పంచుకున్నారు.అవకాశాల కోసం చెన్నైలో ఎదురుచూస్తున్న రోజుల్లో భోజనానికి కూడా ఇబ్బంది పడిన సందర్భాలు ఎదురయ్యాయని నాజర్ వెల్లడించారు. అలాంటి సమయాల్లో తాను చిరంజీవి ఇంటికి వెళ్లి భోజనం చేసేవాడ్నని తెలిపారు. అప్పట్లో చిరంజీవి వరుస షూటింగులతో బిజీగా ఉండేవారని, తన స్నేహితుడి ద్వారా చిరంజీవి అర్ధాంగి సురేఖను సంప్రదించి, ఇంట్లో భోజనం ఉందో లేదో తెలుసుకునేవాడ్నని వివరించారు. భోజనం అందుబాటులో ఉందని తెలియగానే అక్కడికి వెళ్లి తిని వచ్చేవాడ్నని చెప్పారు. ఒక్కోసారి తాను వెళ్లి భోజనం చేసి వచ్చిన విషయం చిరంజీవికి తెలిసేది కాదని, ఆయన షూటింగులో ఎక్కడో ఉండేవారని తెలిపారు. వారి కుటుంబం తనకు చేసిన ఆ సాయం వెలకట్టలేనిదని నాజర్ పేర్కొన్నారు.నటన వైపు అడుగులు వేయడంలో తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని నాజర్ తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి సినీ రంగంలోకి వెళ్లమని తండ్రే సూచించారని చెప్పారు. ఆ తర్వాత చెన్నై చేరుకుని ఓ చిన్న ఉద్యోగంలో చేరారు. యాక్టింగ్ స్కూల్ ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో, ఆఫీస్ సమయం ముగిసిన తర్వాత అదనంగా చిన్న చిన్న పనులు చేస్తూ డబ్బు ఆదా చేసుకున్నారు. చిత్రపరిశ్రమలో ఒక నటుడిగా నిలదొక్కుకోవడానికి తనకు దాదాపు 15 ఏళ్ల సమయం పట్టిందని ఆయన వివరించారు.ఇక తెలుగు చిత్రపరిశ్రమలో తన అరంగేట్రం గురించి మాట్లాడుతూ.. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన 'చంటి' సినిమాతో తాను టాలీవుడ్‌కు పరిచయమయ్యానని తెలిపారు. ఆ సమయంలో తనకు తెలుగు భాష అస్సలు రాదని, కానీ స్టార్ హీరో అయినప్పటికీ వెంకటేశ్ ఎంతో ఓపికగా ప్రతి డైలాగ్‌ను వివరించి, పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకునేలా ప్రోత్సహించారని చెప్పారు.కష్టకాలంలో చిరంజీవి, సురేఖ చూపిన దాతృత్వం.. అలాగే వెంకటేశ్ అందించిన సహకారం తన సినీ ప్రయాణంలో ఎప్పటికీ మరచిపోలేనివని నాజర్ కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఎటువంటి గుర్తింపును ఆశించకుండా నిస్వార్థంగా చేసే సాయమే అత్యంత గొప్పదని ఆయన అన్నారు.

తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నాం?



సమాజంలో ఎక్కడైనా చిన్నపిల్లలపై లైంగిక వేధింపుల ఘటన జరిగినప్పుడు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆవేదన వ్యక్తం చేస్తాం. కానీ ఆ వార్త పాతబడగానే మళ్లీ ఎప్పటిలాగే మౌనంలోకి జారిపోతామన్నది అంతే నిజం. తాజాగా ఈ అంశంపై బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై జరిగే ఇలాంటి అఘాయిత్యాలను అరికట్టే బాధ్యత పిల్లలది కాదని.. పూర్తిగా పెద్దలదేనని కుండబద్దలు కొట్టారు. 2018 నుంచి -అర్పణ్- అనే స్వచ్ఛంద సంస్థకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న విద్యాబాలన్.. చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా సమాజంలోని లోపాలను ఎత్తి చూపారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులు ఎవరూ పట్టుబడరనే ధీమాతోనే రెచ్చిపోతున్నారని విద్యాబాలన్ అభిప్రాయపడ్డారు. పిల్లల మౌనం.. కుటుంబ పరువు పోతుందనే పెద్దల భయం.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సమాజం వెనుకాడే ధోరణి నేరగాళ్లకు కొండంత అండగా మారుతుందన్నారు. కఠినమైన అడుగులు వేయాల్సిన చోట పెద్దలంతా ఆగిపోతున్నారని.. మనకు ఎంతో నమ్మకమైన.. తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నామని విద్య సూటిగా ప్రశ్నించారు. సొంత కుటుంబంలోనే కొన్ని కఠినమైన హద్దులు గీయడం.. ఒక చిన్నారి ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పినప్పుడు దాన్ని గుడ్డిగా కొట్టిపారేయకుండా నమ్మడం పెద్దల కనీస బాధ్యత అని విద్యాబాలన్ గుర్తు చేశారు. ఇంటి పరువు బజారున పడుతుందనే భయంతో నిజాన్ని నాలుగు గోడల మధ్యే సమాధి చేయడం వల్ల నేరగాళ్లకు మరింత బలం చేకూరుతుందని హెచ్చరించారు. పోక్సో చట్టం ఎంత కఠినంగా ఉందో? ప్రజల్లోకి తీసుకెళ్లి నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. గతంలో తాను నటించిన -కహానీ 2- సినిమాలో దుర్గా రాణి పాత్ర చేస్తున్నప్పుడే బాలల వేధింపుల వెనుక ఉన్న చేదు నిజాలు.. బాధితులపై జీవితాంతం ఉండే మానసిక గాయాల గురించి లోతుగా అర్థమైందని విద్యాబాలన్ గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా విడుదలైన తర్వాతే ఇన్నాళ్లూ కార్పెట్ కింద దాచిపెట్టిన ఈ సున్నితమైన అంశంపై ఇళ్లలో చర్చ మొదలైందన్నారు. అయితే ఇలాంటి కథలను తెరకెక్కించేటప్పుడు దర్శక,నిర్మాతలు బాధితులను తప్పుపట్టకుండా.. సంచలనాల కోసం కాకుండా ఎంతో బాధ్యతగా చూపించాలని సూచించారు.కవలం సినిమాలు తీయడం వల్లనో? సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్లో? చిన్నారులకు రక్షణ దక్కదని విద్యాబాలన్ తేల్చి చెప్పారు. సినిమాలు కేవలం ఒక చర్చను మాత్రమే మొదలుపెట్టగలవని ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పనిచేసే సంస్థలకు అండగా నిలవడం.. బాధితులకు న్యాయం జరిగేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. ఇటీవలే విద్యాబాలన్ -జైలర్ 2- లో కాంత పాత్రతో ఎలా అలరించారో తెలిసిందే. కల్పిక్ ఫ్యామిలీ వారసురాలిగా విద్య ఓ రేంజ్ లో అదరగొట్టారు. ప్రస్తుతం విద్య బాలన్ నటిస్తోన్న మరో మూడు బాలీవుడ్ చిత్రాలు ఆన్ సెట్స్ లో

'ఆయనతో ఒక్క ఫోటో చాలనుకున్నా..

ప్రముఖ నటి, దర్శకురాలు రేణూ దేశాయ్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించబోతున్నారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఓం' చిత్రంతో ఆమె నటిగా పునరాగమనం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఈ అవకాశం ఎలా వచ్చింది, తన ఆరోగ్య రహస్యం ఏంటి అనే విషయాలపై ఆసక్తికరమైన వివరాలు పంచుకున్నారు.మమ్ముట్టి లాంటి గొప్ప నటుడితో కలిసి నటించే అవకాశం రావడం తనను ఆశ్చర్యపరిచిందని రేణూ దేశాయ్ అన్నారు. "గతేడాది ఆయన సినిమాలు చూస్తూ, ఎప్పటికైనా ఆయన్ను కలిసి ఒక ఫొటో దిగితే చాలనుకున్నాను. కానీ ఆయన సరసన నటించే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు" అని తెలిపారు. మహాశివరాత్రి రోజున తాను కామాఖ్య దేవాలయంలో ఉన్నప్పుడు చెన్నై నుంచి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ చేసి మమ్ముట్టి సినిమాలో భార్య పాత్రకు ఆఫర్ చేశారని చెప్పారు. మొదట దాన్ని ఒక ప్రాంక్ కాల్ అనుకుని నమ్మలేకపోయానని ఆమె గుర్తుచేసుకున్నారు. రెండు నెలల తర్వాత చిత్రానికి 'ఓం' అని పేరు ప్రకటించగానే తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ఇదంతా దైవ సంకల్పమేనని భావిస్తున్నానని అన్నారు.గత ఏడాది తనకు ఒక సర్జరీ జరిగిందని, దానివల్ల దాదాపు ఆరు నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో కిచిడీ, పెసరపప్పు, సొరకాయ వంటి తేలికపాటి ఆహారం మాత్రమే తీసుకున్నానని చెప్పారు. ఈ ఆహార నియమాలు, విశ్రాంతి వల్లే శరీరంలో వాపు తగ్గి ఇప్పుడు మరింత ఫ్రెష్‌గా కనిపిస్తున్నానని తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించే తనకు భిన్నంగా, ఓ నటిగా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉందని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.



బన్నీ రేసులో బోయపాటి నెంబర్ - 4!



-పుష్ప- విజయంతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను శాసిస్తున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాల విషయం లో పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బన్నీ చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టుల జాబితా చూస్తే? అసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. అందులో మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను స్థానం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. అల్లు అర్జున్ తదుపరి సినిమాల రేసులో బోయపాటి ప్రాజెక్ట్ నాలుగో స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బన్నీ ఫోకస్ అంతా తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రాకా- పైనే పెట్టారు. సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరు గుతోంది. గతంలో ఇద్దరి కాంబినేషన్‌లో రిలీజ్ అయిన -సరైనోడు- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో బన్నీ కోసం బోయపాటి పవర్‌ఫుల్ మైథలాజికల్ టచ్ ఉన్న కథను సిద్ధం చేస్తున్నారని.. అది బన్నీకి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.అయితే ఏ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందన్నది అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. లోకేష్ ప్రాజెక్ట్ మాత్రం వచ్చే ఏడాది పట్టాలెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ కూడా లోకేష్ వేగంగానే పూర్తి చేస్తారు. ఈ విషయంలో లోకేష్ పెద్దగా సమయం తీసుకోరు. చిత్రీకరణ ముగించే విషయంలో లోకేష్ -లియో- స్ట్రాటజీ అనుసరిస్తారని చిత్ర వర్గాల నుంచి తెలుస్తోంది. ఎలా చూసుకున్నా? బోయపాటి ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే? ఎలా లేదన్నా రెండున్నరేళ్లకు పైగా సమయం పడుతుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613